# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




పవిత్రత లోపించిన ఆలోచన, అపవిత్రమైన కార్యంతో సమానమైనదే. కోరికల్ని అదుపు చేస్తే ఉన్నతమైన లక్ష్యాలను చేరుకోవచ్చు. లైంగిక శక్తిని ఆధ్యాత్మిక మార్గంలోకి మరల్చండి.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 48 ఆదివారం 02 ఏప్రిల్ 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# వందే భారత్ దేశ ప్రగతికి నిదర్శనం

## మరో రైలుకు జెండా ఊపిన మోదీ

**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

ప్రధాని నరేంద్రమోదీ శనివారం మరో వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్-దిల్లీ మధ్య ఈ రైలు రాకపోకలు సాగిస్తుంది. ప్రధాని జెండా ఊపడంతో రాణి కమలాపతి రైల్వే స్టేషన్ నుంచి ఇది ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో ప్రధానితో పాటు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ..అభివృద్ధి చెందుతోన్న భారత్‌కు వందే భారత్ రైలు నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఇది మనదేశ నైపుణ్యాలు, శక్తిసామర్థ్యాలను ప్రదర్శిస్తోందన్నారు. గత ప్రభుత్వాలు బుజ్జగింపు చర్యలు మాత్రమే చేపట్టాయని, తాము మాత్రం ప్రజల ఆకాంక్షలు నెరవేర్చేందుకే కట్టుబడి ఉన్నామని చెప్పారు.

భారతీయ రైల్వే నెట్‌వర్క్‌లో ఇది 11వ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ భారతీయ రైల్వేలో గంటకు 160కి.మీ వేగంతో నడిచే మొదటి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా ఇదే. 708 కిలోమీటర్ల దూరాన్ని7.45 గంటల్లో పూర్తిచేయగలదు. భారతీయ రైల్వే ఇప్పటి వరకు 10 వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను ప్రారంభించింది. చాలా మార్గాల్లో వేగ పరిమితుల దృష్ట్యా అవి ఇప్పటి వరకు 130కి.మీ వేగంతో నడవడానికి మాత్రమే అనుమతి ఉంది.



ఈ కార్యక్రమంలో భాగంగా.. ఇండోర్ ఆలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా జరిగిన మెట్లబావి దుర్ఘటనపై మోదీ స్పందించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య 36కు చేరింది. వారి కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.



## భోపాల్- న్యూఢిల్లీ వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు ప్రధాని మోదీ పచ్చజెండా

**భోపాల్:**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శనివారం మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో పర్యటిస్తున్నారు.తన పర్యటన సందర్భంగా మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లోని రాణి కమలాపతి రైల్వే స్టేషన్ నుంచి భోపాల్-న్యూఢిల్లీ మార్గంలోదేశంలోని 11వ వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ను ప్రధాన మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.ఈ రైలుతో రెండు ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని తగ్గిస్తోంది.ప్రయాణికులు భోపాల్ నుంచి న్యూఢిల్లీ సెమీ హై స్పీడ్ రైలులో 7 గంటల 45 నిమిషాల్లో చేరనున్నారు. “భోపాల్- న్యూఢిల్లీ మధ్య వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఫ్లాగ్ ఆఫ్‌తో మధ్యప్రదేశ్- ఢిల్లీ మధ్య కనెక్టివిటీని పెంచుతుంది” అని ప్రధాని మోదీ శనివారం ట్వీట్ చేశారు. దేశంలోనే తయారు చేసిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సెట్‌లో అత్యాధునిక ప్రయాణీకుల సౌకర్యాలు ఉన్నాయి. ఇది రైలు వినియోగదారులకు వేగవంతమైన, సౌకర్యవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందిస్తుంది. ఈ రైలు కేంద్ర ప్రభుత్వ యాజమాన్యంలోని చెన్నై ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి చేశారు.

# ఏకే-47తో లేపేస్తా

## ఎంపీ సంజయ్ రౌత్‌కు గ్యాంగ్‌స్టర్ నుంచి బెదిరింపు

**ముంబయి :**

ఏకే-47తో లేపేస్తానని ఓ ఘరానా గ్యాంగ్‌స్టర్ సాక్షాత్తూ ఎంపీని బెదిరించిన ఘటన మహారాష్ట్రలో సంచలనం రేపింది. మహారాష్ట్రకు చెందిన రాజ్యసభ ఎంపీ సంజయ్ రౌత్‌కు గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నుంచి హత్య చేస్తామని బెదిరింపు వచ్చింది.లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్నుంచి తనకు ప్రాణహాని ఉందనిశివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలో పంజాబీ గాయకుడు సిద్ధూ మూస్ వాలా మాదిరిగానే సంజయ్ రౌత్‌ను హిందూ వ్యతిరేకిగా పేర్కొంటూ హత్య చేస్తామని బెదిరింపు సందేశంలో గ్యాంగ్‌స్టర్ పేర్కొన్నాడు.గతంలో లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ను కూడా చంపుతామని బెదిరించింది. శుక్రవారం రాత్రి పూణె పోలీసులు బెదిరించిన నిందితుడిని అదుపులోకి తీసుకుని ముంబయి పోలీసులకు అప్పగించారు.గత ఏడాది ఆగస్టులో



పాత్రా చాల్ భూ కుంభకోణం కేసులో సంజయ్ రౌత్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఆరు గంటలకు పైగా ప్రశ్నించిన తర్వాత అరెస్టు చేసింది.ఏక్‌నాథ్ షిండే అధికారంలోకి వచ్చిన తర్వాత తమ క్యాంపు నాయకులకు భద్రత తగ్గించారని సంజయ్ రౌత్ ఆరోపించారు. తాను బెదిరింపులకు భయపడనని, దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశానని సంజయ్ చెప్పారు.

# ఖట్మండు, అండమాన్ నికోబార్ దీవుల్లో భూకంపం



**ప్రజాతపన ,న్యూఢిల్లీ:**

నేపాల్ దేశంలోని ఖట్మండు, భారతదేశంలోని అండమాన్ నికోబార్ దీవుల్లో శనివారం భూకంపం సంభవించింది. నేపాల్ దేశ రాజధాని నగరమైన ఖట్మండ్ లో శనివారం తెల్లవారుజామున 3.04 గంటలకు భూకంపంవచ్చిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ వెల్లడించింది. 25కిలోమీటర్ల లోతులో సంభవించిన ఈ భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 3.5 గా

(మిగతా 2లో)



## రాహుల్ పై మరో కేసు

**ముంబై:**

కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ పై మరో పరువునష్టం కేసు నమోదైంది. భారత్ జోడో యాత్ర సందర్భంగా పలు బహిరంగ సభల్లో రాహుల్ గాంధీ ప్రసంగించారు. అలా ఒక సభలో ప్రసంగిస్తూ, ఆరెస్సెస్ పై విమర్శలు గుప్పించారు. ఆ విమర్శలపై ఇప్పుడు పరువు నష్టం దావా వేశారు.భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ గాంధీ ఆరెస్సెస్ వారిని 21వ శతాబ్దపు కౌరవులుగా అభివర్ణించారు. భారత్ జోడో యాత్ర ముగిసి కూడా మూడు నెలలు ముగిశాయి. తాజాగా రాహుల్ గాంధీ నాడు ఆరెస్సెస్ వారిని 21వ శతాబ్ధపు కౌరవులుగా అభివర్ణించడంపై హరిద్వార్ కోర్టులో శుక్రవారం పరువునష్టం పిటిషన్ దాఖలైంది. రాహుల్ గాంధీ పై బిహార్ లోని ఒక కోర్టులోనూ పరువునష్టం దావా దాఖలైంది. ఆ కేసును బిహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ కుమార్ మోదీ వేశారు.ప్రధాని నరేంద్రమోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై గుజరాత్ కోర్టు

(మిగతా 2లో)

# ప్రధానులు మారినా... మారని తలరాతలు

**ప్రజాతపన ,హైదరాబాద్ :**

స్వాతంత్రం వచ్చిన తర్వాత 14 మంది ప్రధానులు మారారని, అయినా దేశ ప్రజల తలరాత మారలేదని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. దేశంలో రైతు సంఘటిత శక్తిని ఏకం చేద్దామని ఆయన పిలుపునిచ్చారు. ఈరోజు మహారాష్ట్ర షెట్కారీ సంఘటన్ రైతు నేత శరద్ జోషి ప్రణీత్ సహా పలువురు రైతు నేతలు బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. వారిని సాదరంగా పార్టీలోకి ఆహ్వానించిన తర్వాత ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రైతుల పోరాటం న్యాయబద్ధమైనదని, తలచుకుంటే సాధ్యం కానిదంటూ ఏమీ ఉండదని చెప్పారు. చిత్తశుద్ధితో పని చేస్తే.. తప్పకుండా గెలిచి తీరుతామని అన్నారు. తన 50 ఏళ్ల రాజకీయ జీవితంలో తానెన్నో ఆటుపోట్లను ఎదుర్కొన్నానని, తెలంగాణలో ఏం చేశామో మీరందరూ ఒకసారి చూడండని, కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించండి అని రైతు నేతల్ని సూచించారుదేశ రాజధాని ఢిల్లీలో రైతులు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు పోరాడారని.. ఆ సమయంలో రైతులను ఉగ్రవాదులని, ఖలీస్తానీలని, వేర్పాటవాదులని విమర్శించారని సీఎం కేసీఆర్ గుర్తు చేశారు. అయితే.. రైతులు వెనకడుగు వేయకుండా తమ పోరాటాన్ని కొనసాగించడంతో, ప్రధాని మోడీ దిగివచ్చిన క్షమాపణ చెప్పారని, ఆ చట్టాలని ఉపసంహరించుకున్నారని తెలిపారు. 750 మంది రైతులు చనిపోతే.. ప్రధాని కనీసం స్పందించలేదని మండిపడ్డారు. మన దేశంలో దేనికి కొదవ లేదని.. అయినప్పటికీ రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. తెలంగాణ ఏర్పడక ముందు రైతులు, చేనేతలు ఆర్థిక



సమస్యల కారణంగా ఆత్మహత్యలు చేసుకునేవారని.. రైతుల గోస చూసి తన కన్నీళ్లు ఆగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే తెలంగాణ వచ్చిన తర్వాత వ్యవసాయాన్ని సుస్థిరం చేశామని, దాంతో రైతుల ఆత్మహత్యలు చాలావరకు తగ్గాయని పేర్కొన్నారు. దేశంలో 94 లక్షల ఎకరాల్లో వరి పండితే.. అందులో 56 లక్షల ఎకరాల వరి ఒక్క తెలంగాణ రాష్ట్రంలోనే పండుతుందని సీఎం కేసీఆర్ తెలియజేశారు.ఇదిలావుండగా.. ముఖ్యమంత్రి కేసీఆర్ సమక్షంలో మహారాష్ట్ర షెట్కారీ సంఘటన్ రైతు నేత శరద్ జోషి ప్రణీత్‌తో పాటు కొందరు రైతు నేతలు తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కిసాన్ సమితి జాతీయ అధ్యక్షుడు గుర్నామ్ సింగ్ చడునీ, మహారాష్ట్ర కిసాన్ సమితి అధ్యక్షుడు మాణిక్ కదం, మంత్రులు సత్యవతి రాథోడ్, హరీశ్‌రావు, ఎమ్మెల్యే జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డితో పాటు పలవురు నేతలు పాల్గొన్నారు.

(మిగతా 2లో)

ప్రజా తపన
prajathapana.com
News that matters

# రాహుల్ పై మరో కేసు నమోదు

(మొదటిపేజీ తరువాయి)

రాహుల్ గాంధీ కి ఇటీవల రెండు సంవత్సరాల జైలు శిక్ష విధించిన విషయం తెలిసిందే. ఈ తీర్పుపై పై కోర్టులో అప్పీల్ చేసుకోవడానికి కోర్టు నెల రోజుల గడువు ఇచ్చింది. కాగా, ఈ తీర్పు వెలువడిన మర్నాడే, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని నిబంధనల ప్రకారం, రాహుల్ గాంధీ ని లోక్ సభ సభ్యత్వానికి అనర్హుడిగా లోక్ సభ సెక్రటేరియట్ ప్రకటించింది. ఆ మర్నాడే, ఎంపీగా ఢిల్లీలో ఆయనకు కేటాయించిన బంగళాను ఖాళీ చేయాలని నోటీసులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా అన్ని విపక్షాలు ప్రధాని మోదీ, కేంద్ర ప్రభుత్వం కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించాయి. మహారాష్ట్రలోని థానేలో కూడా రాహుల్ గాంధీ పై ఒక పరువు నష్టం కేసు నడుస్తోంది. మహాత్మా గాంధీ హత్యకు ఆరెస్సెస్సే కారణమని 2014 లో రాహుల్ గాంధీ ఒక బహిరంగ సభలో ఆరోపించారు. ఆ వ్యాఖ్యలపై ఆరెస్సెస్ కార్యకర్త ఒకరు థానే కోర్టులో దావా వేశారు. మరోవైపు, సావర్కర్ ను బ్రిటిష వారిని క్షమాపణలు కోరారంటూ రాహుల్ గాంధీ పదేపదే చేస్తున్న వ్యాఖ్యలపై బీజేపీ నేతలే కాకుండా, మిత్రపక్షమైన శివసేన నేతలు కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ఖట్మండు, అండమాన్ నికోబార్ దీవుల్లో భూకంపం

(మొదటిపేజీ తరువాయి)

నమోదైందని అధికారులు చెప్పారు. ఫిబ్రవరి నెలలో సంభవించిన భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 5.2గా నమోదైంది. గతంలో సంభవించిన భూకంపం వల్ల నేపాల్ దేశంలో భారీ నష్టం సంభవించింది.భారతదేశంలోని అండమాన్ నికోబార్ దీవుల్లోనూ శుక్రవారం రాత్రి 11.56 గంటలకు భూకంపం సంభవించింది. 28 కిలోమీటర్ల లోతులో సంభవించిన భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.0గా నమోదైందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ తెలిపింది. మార్చి 24వతేదీన కూడా అంబికాపూర్, ఛత్తీస్ ఘడ్ ప్రాంతాల్లో భూమి కంపించింది. పోర్ట్ బ్లెయిర్ కు 140 కిలోమీటర్ల దూరంలోని అండమాన్ నికోబార్ దీవుల్లో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సీస్మాలజీ ట్వీట్ చేసింది.

# ప్రధానులు మారినా... మారని తలరాతలు

(మొదటిపేజీ తరువాయి)

నా 50 ఏండ్ల రాజకీయ అనుభవంలో ఎన్నో అటుపోట్లు ఎదుర్కొన్నాను. తెలంగాణలో ఏం చేశామో మీరంతా ఒకసారి చూడండి. కాళేశ్వరం ప్రాజెక్టును సందర్శించండి అని కేసీఆర్ రైతు నేతలకు సూచించారు.13 నెలల పాటు దేశ రాజధానిలో రైతులు పోరాడారు అని కేసీఆర్ గుర్తు చేశారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఉద్యమించిన రైతులను ఉగ్రవాదులన్నారు.. ఖలీస్తానీలన్నారు.. వేర్పాటువాదులన్నారు. రైతుల పోరాటంతో మోదీ దిగివచ్చి క్షమాపణ చెప్పారు. 750 మంది రైతులు చనిపోతే ప్రధాని కనీసం స్పందించలేదు. మన దేశంలో దేనికి కొదవ లేదు. అయినప్పటికీ రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అని కేసీఆర్ పేర్కొన్నారు.తెలంగాణ ఏర్పడక ముందు రైతులు, చేనేతలు ఆత్మహత్యలు చేసుకునేవారు అని కేసీఆర్ గుర్తు చేశారు. వ్యవసాయాన్ని సుస్థిరం చేశాక రైతుల ఆత్మహత్యలు ఆగాయి. రైతుల గోస చూసి నాకు కన్నీళ్లు వచ్చేవి. దేశంలో 94 లక్షల ఎకరాల్లో వరి పండుతుంది. అందులో 56 లక్షల ఎకరాల వరి తెలంగాణలోనే పండుతుంది అని కేసీఆర్ తెలిపారు.

# లాభాలబాటలో విశాఖ పోర్టు ట్రస్ట్

**విశాఖపట్నం**

90 ఏళ్ల పోర్ట్ ట్రస్ట్ చరిత్రలో 73.75 మిలియన్స్ కార్గో హ్యాండిల్ చేయడం జరిగిందని పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ కే రామ్మో హన్ అన్నారు. అక్కయ్యపాలెం పోర్టు కళావాణి సమావేశ మందిరంలో ఏర్పా టుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మేజర్ పోర్టుల లో విశాఖ పోర్టు ట్రస్ట్ నాలుగవ ర్యాం కు లో ఉందన్నారు. ఈస్ట్ కోస్ట్ లో సెకండ్ ర్యాంకులో ఉందని వెల్లడించా రు. పోర్ట్ ట్రస్ట్ అభివృద్ధికి కృషి చేయ డం జరుగుతుందన్నారు.ఇన్నర్ హార్బర్లో కూడా పెద్ద షిప్స్ ను తీసుకొ చ్చే విధంగా రూపకల్పన చేసామన్నా రు. అలాగే ఆపరేషన్ లో లేకుండా ఉన్న ఆరో నెంబర్, ఆదానీ బెర్త్ లును ఉపయోగించి 119 కోట్లు అదనపు ఆదాయం సమకూర్చమన్నారు. 7500 ఎకరాలు కలిగిన పోర్ట్ ట్రస్ట్ స్థలాలలో నిరుపయోగంగా ఉన్న భూములకు పబ్లిక్ ప్రైవేట్ పద్ధతిలో లీజుకిస్తూ ఫిక్స్డ్ అమౌంట్ లో వడ్డీ రూపంలో సంవత్సరానికి అదనపు కోట్లు ఆదాయం వచ్చేలా చేసామన్నారు. పోర్ట్ ట్రస్టులో అనేక మార్పులు తీసుకువచ్చి ఆదాయాన్ని పెంచే మార్గాలని అనుసరిస్తున్నామని వెల్లడించారు. కార్గో హ్యాండల్ ద్వారా 1700 కోట్లు ఆదాయం వస్తుందని ఈ సందర్భంగా తెలిపారు.

# నిరుద్యోగుల విషయంలో కలిసి పోరాడుదాం

## బండి సంజయ్ , రేవంత్ రెడ్డి లకు వైఎస్సార్టీపీ అధినేత వైఎస్ షర్మిల ఫోన్



**హైదరాబాద్ :**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కి వైఎస్సార్టీపీ అధినేత వైఎస్ షర్మిల ఫోన్ చేశారు. నిరుద్యోగుల విషయంలో కలిసి పోరాడదామని ఇరువురు నేతలను షర్మిల కోరారు. ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చెద్దామని చెప్పారు. ప్రగతి భవన్ మార్చ్ పిలుపు నిద్దామని షర్మిల సూచించారు. సీఎం కేసీఆర్ మెడలు వంచాలి అంటే ప్రతిపక్షాలు ఏకం కావాలని అన్నారు. కలిసి పోరాటం చేయక పోతే ప్రతిపక్షాలను తెలంగాణలో కేసీఆర్ బ్రతకనివ్వరని తెలిపారు. షర్మిల ఫోన్‌కాల్‌పై బండి సంజయ్, రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారు. ఉమ్మడిగా పోరాటం చేసేందుకు బండి సంజయ్ మద్దతు తెలిపారు. త్వరలో సమావేశం అవుదామని చెప్పారు. నిరుద్యోగుల విషయంలో ఉమ్మడి పోరాటానికి పూర్తి మద్దతు ఉంటుందని బీజేపీ నేత స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు కలిసి పోరాటం చేయాల్సిన సమయం ఏర్పడిందని రేవంత్ రెడ్డి అన్నారు.

కాగా... టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజ్ అంశాన్ని వైఎస్సార్టీపీ అధినేత్రి వైఎస్ షర్మిల సీరియస్‌గా తీసుకున్నారు. లీకేజ్‌లో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇప్పటికే పలుమార్లు షర్మిల పోరాటం చేశారు. రెండు సార్లు షర్మిల పోరాటాన్ని పోలీసులు అడ్డుకోగా.. నిన్న మూడో సారి పోలీసులకు సమాచారం ఇవ్వకుండా టీఎస్‌పీఎస్సీ కార్యాలయానికి చేరుకున్నారు. టీఎస్‌పీఎస్సీ ముట్టడికి యత్నించిన షర్మిలను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో రాష్ట్రంలోని ప్రతిపక్ష పార్టీలతో కలిసి నిరుద్యోగుల విషయంలో పోరాడాలని షర్మిల నిర్ణయించారు. ఈ మేరకు బీజేపీ నేత బండిసంజయ్, కాంగ్రెస్ నేత రేవంత్ రెడ్డికి ఫోన్‌లు చేసి.. కలిసి పోరాడుదామంటూ షర్మిల పిలుపునిచ్చారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు భాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య

### నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కొసం భూక్తి కొసం వెట్టిచాకిరి విముక్తి కొసం పోరాడిన యోధుడు -నేడు ఆయన జయంతి



హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమంగా పిలుస్తారు. తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర వినగానే మొదటగా గుర్తొచ్చేది తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు తొలి అమరుడు దొడ్డి కొమరయ్య. 03 ఏప్రిల్ 1927లో వరంగల్లు జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో సాధారణ గొర్రెల పెంపకందార్ల కుటుంబములో జన్మించాడు. ఇతని అన్న దొడ్డి మల్లయ్య కమ్యూనిస్టు పార్టీ గ్రామ నాయకుడు. విసునూర్ దేశ్‌ముఖ్ రామచంద్రా రెడ్డి తల్లి జానకమ్మా దొరసాని. ఆమె కడికవెండిలో వుండేది. ఈమె ప్రజల పట్ల అతి క్రూరంగా వ్యవహరించేది. మనషులను వెట్టిచాకిరి చేయించడంలో వడ్డీలు వసూలు చేయడంలో రకరకాల శిక్షలు, జరిమానాలు విధించడంలో పేరుగాంచింది. వెట్టి చాకిరికి దొపిడికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట సేనాని ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కడివెండి వెళ్లి ఆంధ్ర మహా సభ సందేశాన్ని ప్రజలకు వినిపించాడు. దీంతో గ్రామంలో సంఘమేర్పడింది. ఉత్సాహంగా యువతీ యువకులు ముందుకొచ్చారు. దిన దినంగా కడివెండిలో సంఘం బలంగా అయింది. వెట్టచాకిరిని నిర్మూలించారు. దొరలు, విసునూర్ ల ఆటలను అరికట్టించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిననూ నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంతో గడుపుచుండగా నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో కూరుకుపోయారు.1946 జులై 2 న విసునూర్ నైజాం అల్లరి మూకలు రౌడీలతో 40 మంది వచ్చారు. ప్రజలంతా ఏకమై కర్రలు, బడిశెలు, గునపాలు అందుకుని విసునూర్, నిజాం, రజాకర్లను తరిమికొట్టారు. కడివెండి గ్రామంలో 1946 జులై 4న దేశ్‌ముఖ్ తొత్తులకు, రజాకార్లకు
వ్యతిరేకంగా గుత్పల సంఘం తిరుగుబాటు లేవదీసింది. మల్లయ్య, కొమురయ్య నాయకత్వంలో ఆ తిరుగుబాటు ముందుకు సాగింది. మల్లయ్య, కొమురయ్యలను మట్టుబెడితే ఉద్యమం ఆపేయవచ్చునని జానకమ్మ దొరసాని ఆలోచించింది. దొరలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఊరేగింపుగా గడీ దగ్గరకు ర్యాలీ రాగానే రజాకార్లు, దొర బంట్లు గడీ లోపలి నుంచి జనంపైకి కాల్పులు జరిపారు. తొలుత దొడ్డి మల్లయ్య మోకాళ్లలో, మంగళి కొండయ్య నుదుట, దొడ్డి నర్సయ్య మోచేతి గుండా తూటాలు వెళ్లాయి. దొడ్డి కొమురయ్య పొట్టను చీల్చుకుంటూ తూటాలు పోవడంతో రక్తపు మడుగులో అతను నేలకొరిగాడు. కొమురయ్య రక్తంతో అక్కడి నేలంతా తడిచింది. నైజాం అల్లరి మూకలు, విసునూర్ తుపాకి తూటాలకు నేలరాలిన అరుణతారగా తెలంగాణ విప్లవంలో చెరగని ముద్రవేసుకున్నాడు దొడ్డి కొమురయ్య. మరణ వార్త జనగాం ప్రాంత ఆంధ్రమహాసభ కార్యకర్తలందరకీ విషాదకరమైన వార్తయింది. దేశ్‌ముఖ్, విసు నూర్ ఆగడాలన ఎదుర్కోవవడానికి పాలకుర్తి ప్రాంతం నుంచి యాదగిరిరావు, నిర్మల్
కృష్ణమూర్తి, నాయకత్వంలో ఆరు వేల మంది ప్రజాసైన్యం బయలుదేరింది. అప్పటి వరకూ శాంతియుతంగా సాగిన తెలంగాణ విముక్తి పోరు కాస్తా కొమురయ్య అమరత్వంతో రక్తానికి రక్తం.. ప్రాణానికి ప్రాణం.. అనే నినాదంతో సాయుధ పోరాటంగా మారింది. కొమురయ్య మరణంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం పోటెత్తడంతో దొరల గడీ నేలమట్టమైంది. కొమురయ్య త్యాగంతో మొదలైన పోరాటం హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఆంధ్ర మహాసభ కమ్యునిస్టు పార్టీగా అవతరించింది. ఎందరో నేతలు రైతులతో భుజంభుజం కలిపి తుపాకులు పట్టారు. దున్నే వాడిదే భూమి నినాదం మార్మోగింది. లక్షల ఎకరాల భూమి లేని పేదలకు పంచబడ్డాయి.

# పవన్ సీఎం ప్రకటిస్తే..వైసీపీ ఓటమి

**కాకినాడ:**

పవన్ కల్యాణ్ ఐదేళ్లు సీఎంగా ఉండాలంటే జనసేన 175 స్థానాల్లో పోటీ చేయాలని కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు హరిరామ జోగయ్య వ్యాఖ్యానించారు. జనసేన ఒంటరిగా పోటీ చేస్తే పవన్ కల్యాణ్ ఐదేళ్లు సీఎంగా ఉంటారని అన్నారు. బీజేపీతో కలిస్తే మోదీ చరిష్మా తోడయి అదనపు బలం చేకూరుతుందని అన్నారు. టీడీపీ జనసేనతో కలిస్తే ఇక వైసీపీ ఓటమి ఖాయమని హరిరామ జోగయ్య జోస్యం చెప్పారు. అయితే పవన్ కల్యాణ్ ను సీఎం చేస్తేనే వైసీపీని ఓడించగలరని, ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించాలని జోగయ్య డిమాండ్ చేశారు. గతం కంటే జనసేన బలం పెరిగింది.. మూడు పార్టీలు విడివిడిగా పోటీ చేస్తే పవన్ కల్యాణ్ 5 ఏళ్లు సీఎంగా ఉంటారన్నారు. హరిరామ జోగయ్య గత కొంతకాలంగా పవన్ సీఎం కావాలంటూ వ్యాఖ్యలు చేస్తున్నారు. అలా ఒప్పందం కుదుర్చుకున్న తర్వాతనే పొత్తు కుదుర్చుకోవాలని హరిరామ జోగయ్య అనేక సార్లు అన్నారు. అలా కాకుండా కేవలం మంత్రి పదవులతో సరిపెట్టుకుంటూ పొత్తు కుదుర్చుకుంటే ప్రయోజనం ఉండదని కూడా సూచించారు. చంద్రబాబు ఈ విషయంపై స్పష్టత ఇచ్చిన తర్వాతనే పొత్తుకు దిగాలని హరిరామ జోగయ్య సూచిస్తున్నారు. మరో వైపు పవన్ కల్యాణ్ మాత్రం తాను ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనివ్వనంటూ, ఆత్మగౌరవానికి దెబ్బకలగకుండా పొత్తుల నిర్ణయం ఉంటుందని చెబుతున్నారు.పొత్తులపై ఇతర పార్టీల మైండ్ గేమ్‌లో పడొద్దని తమ పార్టీ నేతలకు పవన్ కల్యాణ్ చెబుతున్నారు. ఆంధ్రప్రదేశ రాజకీయాలకు మనం స్పష్టంగా ఉందాం. మనం చేసేది చెబుదాం. పొత్తులు, ఎత్తులపై మనకంటూ ఒక లైన్ ఉండాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ నాయకులకు హితబోధన చేస్తున్నారు. ఇప్పటి వరకు రాజకీయాలు ఒక ఎత్తు, మనం చేసే రాజకీయం మరో ఎత్తంటూ నేతలకు పవన్ ప్రత్యేంగా క్లాస్ తీసుకుంటున్నారు. పదేళ్ళ రాజకీయ ప్రస్థానంలో మనం చూసింది, చేసింది, చెప్పేది, వీటన్నింటకి చాలా వ్యత్యాసం ఉందని, పవన్ తన అభిప్రాయాలను నాయకుల ముందుంచుతున్నారని చెబుతున్నారు. ఇటీవల కాలంలో తనను కలసిన నాయకులతో పవన్ చాలా డిఫరెంట్‌గా మాట్లాడుతుండటం చర్చనీయాశంగా మారింది. పదో ఆవిర్భావ దినోత్సం సభలో తన ప్రసంగంలో కూడా డిఫరెంట్ స్టైల్ చూపించిన పవన్ ఆ తరవాత నుంచి సినిమా షూటింగ్‌లలో బిజగా ఉంటున్నారు. అయితే సమయం దొరికినప్పుడల్లా తనను కలసిన పార్టీ నేతలో పవన్ భవిష్యత్ కార్యక్రమాలు అంటూ కొన్ని బాధ్యతలు అప్పగిస్తున్నారు. పలు దఫాలుగా నేతలతో మాట్లాడుతూ... కేడర్‌కు చెప్పాల్సిన విషయాలను సూటిగా చెబుతున్నారని జనసేన వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటి వరకు పరిస్థితులు వేరు, ఇప్పుడు పరిస్థితులు వేరు కాబట్టి రాజకీయాల్లో మనం నిలబడాలంటే ముందుగా ఎదుటి వారి ట్రాప్‌లో పడకూడదని పవన్ పదే పదే చెబుతున్నారు. కానీ కొంత మంది నేతలు మాత్రం పూర్తిగా పొత్తుల గురించే మాట్లాడుతున్నారు.

# జగన్ కు ఎందుకు దూరమో... త్వరలో చెబుతా

**విజయవాడ:**

దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి అత్యంత సన్నిహితులుగా ఉన్న కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావును వైఎస్ ఆత్మగా పిలిచేవారు.. అయితే, వైఎస్సార్ కన్నుమూసిన తర్వాత ఆయన కుమారుడు వైఎస్ జగన్‌తో కేవీపీకి సంబంధాలు లేవు.. ఇవాళ విజయవాడలో మీట్‌ది ప్రెస్‌లో ఇదే ప్రశ్న కేవీపీకి ఎదురైంది.. దీనిపై స్పందిస్తూ.. వైఎస్సార్‌కు దగ్గరగా ఉన్న నేను జగన్‌కు ఎందుకు దూరమయ్యాననే అంశంపై ఇప్పుడు సమాధానం చెప్పబోనన్నారు.. కానీ, ఈ ప్రశ్నల నుంచి ఎంతో కాలం దూరం జరగలేను.. ఏదో ఒక రోజు సమాధానం చెప్పాల్సిందే.. మరో రోజు ప్రెస్ మీట్ పెట్టి అన్ని విషయాలు వివరిస్తానని తెలిపారు కేవీపీ.. దీంతో, ఆయన ప్రత్యేకంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వైఎస్ జగన్ సంబంధాలపై ఏర్పాటు చేసే ఆ ప్రెస్‌మీట్‌లో ఏం చెప్పబోతున్నారు అనే చర్చ ఇప్పుడు ఏపీ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారిపోయింది.మరోవైపు.. బీజేపీ–వైసీపీ సంబంధాలపై సీరియస్‌గానే స్పందించారు కేవీపీ.. బీజేపీని వైసీపీ ఎందుకు ప్రశ్నించ లేకపోతుందో నాకు కారణం తెలియదన్న ఆయన.. ప్రత్యేక పరిస్థితులని చెప్పిన నేనే.. ఆ ప్రత్యేక పరిస్థితులేంటో తెలియదని చెబుతున్నాను అన్నారు.. ఇక, చంద్రబాబుపై విరుచుకుపడ్డారు కేవీపీ.. 2018లో టీడీపీతో పొత్తు పెట్టుకోవడాన్ని నేను వ్యతిరేకించా.. ఈ విషయం ఇప్పటి వరకూ ఎక్కడా చెప్పలేదు. టీడీపీతో పొత్తు నచ్చకున్నా.. క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా నోరు మెదపలేదన్నారు. ఆనాడు నేనెక్కడా ప్రచారంలో పాల్గొనలేదు. ప్రత్యేక హోదా అక్కర్లేదు.. ప్యాకేజీ చాలంటూ చంద్రబాబు ఏపీకి మరణ శాసనం రాశారని.. ఆ తర్వాత ప్రత్యేక హోదా గురించి దీక్ష చేయడం చంద్రబాబు వల్లే సాధ్యమైంది అంటూ మండిపడ్డారు. 2016లో రాహుల్ గాంధీ మీద రాళ్లేయించిన చంద్రబాబు.. 2018లో తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకున్నారని.. ఎన్టీఆర్ కోసం 1984లో పోరాటం చేసి.. అదే ఎన్టీఆర్‌ను పార్టీ నుంచి బయటకి పంపిన ఘనుడు చంద్రబాబు అంటూ ఫైర్ అయ్యారు.వైఎస్ తవ్వించిన కాల్వల నుంచి నీరు పారించి.. మొత్తం నేనే చేశానని చెప్పుకునే ఘనుడు చంద్రబాబు అంటూ ఎద్దేవా చేశారు కేవీపీ.. సెల్ ఫోన్లు తెచ్చిన సమర్థుడు చంద్రబాబు. జాతీయ స్థాయిలో రాజకీయాలు చేసే చంద్రబాబు.. రాహుల్ లోక్ సభ సభ్యత్వం రద్దు విషయంలో ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు. చంద్రబాబు ఇక్కడ కూర్చొని ప్రజాస్వామ్యం గురించి మాట్లాడడం దేనికి.. ఢిల్లీకి వచ్చి పోరాడాలని సూచించారు. చంద్రబాబుకు జేడీఎస్ తో ఇప్పటికే మంచి పరిచయాలు ఉన్నాయని గుర్తుచేశారు.. ఏపీలో మురికి కాల్వల్లో అవినీతి గురించి మాట్లడడానికే చంద్రబాబు పరిమితం కాకూడదు అంతూ హితవు పలికారు కేవీపీ రామచంద్రరావు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# కోటం, ఆనంలకు టీడీపీ..గ్యారంటీ..?

**విజయవాడ :**



లుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడిన ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలకే టిక్కెట్ కన్ఫర్మ్ చేశారట. మిగిలిన ఇద్దరికి మాత్రం నో చెప్పేశారట. పార్టీ వర్గాల్లో ఇది చర్చనీయాంశమైంది. ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల్లో నలుగురు ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్‌కు పాల్పడ్డారని వారిపై వైసీపీ అధిష్టానం సస్పెన్షన్ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఈ నలుగురిలో ఇద్దరికే 2024 ఎన్నికల్లో టిక్కెట్ హామీని చంద్రబాబు ఇచ్చారంటున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, గుంటూరు జిల్లాకు చెందిన ఉండవల్లి శ్రీదేవిల రాజకీయ భవిష్యత్ పై జోరుగా ఊహాగానాలు జరుగుతున్నాయి. ఈ నలుగురిలో ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిలకు మాత్రమే టిక్కెట్ హామీ పార్టీ అధినేత నుంచి లభించిందంటున్నారు. ఆనంకు ఆత్మకూరు నియోజకవర్గం, శ్రీధర్ రెడ్డికి నెల్లూరు రూరల్ నియోజకవర్గం టీడీపీ టిక్కెట్లు దాదాపు కన్ఫర్మ్ అయినట్లే. వారిద్దరూ గత కొంత కాలంగా అధికార పార్టీపై విమర్శలు చేస్తున్నదీ అందుకేనట. ముందుగానే చంద్రబాబుతో మాట్లాడుకున్న తర్వాత వారిద్దరూ థిక్కార స్వరం వినిపించారంటారు. అందుకే వారిద్దరి నియోజకవర్గాల్లో సమన్వయకర్తలను నియమించినా పెద్దగా బాధపడలేదు. మొన్న సస్పెండ్ చేసినా పెద్దగా ఆశ్చర్యానికి లోను కాలేదుఇప్పటికే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఎన్నికలకు ముందు శ్రీధర్ రెడ్డి కూడా కండువా కప్పేసుకుంటారు. ఆనం విషయంలో అది జరగకపోయినా ఆయన దారి కూడా అదేనన్నది ఇక అందరికీ తెలిసిన విషయమే. ఆత్మకూరులో పార్టీ గెలవాలంటే ఆనం అవసరమని చంద్రబాబు గట్టిగా భావిస్తున్నారు. అక్కడ సరైన అభ్యర్థి లేకపోవడంతో ఆనం ఆత్మకూరు నుంచి టీడీపీ అభ్యర్థిగా వచ్చే ఎన్నికల్లో బరిలోకి దిగనున్నారు. ఇక నెల్లూరు రూరల్ లో కొంత పాత టీడీపీ నేతలు కోటంరెడ్డి చేరికపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నా అది టీ కప్పులో తుపాను మాత్రమేనని చంద్రబాబు భావిస్తున్నారు. మెల్లగా సర్దుకుంటాయని, వారి చేరికలకు ఇంకా సమయం ఉండటంతో అసమ్మతిపై చంద్రబాబు పెద్దగా దృష్టిపెట్టలేదు. . ఇక మరో ఇద్దరి ఎమ్మెల్యేల పరిస్థితి ఎటూ గాకుండా ఉంది. ఉండవల్లి శ్రీదేవిని పార్టీలో కూడా చేర్చుకునే అవకాశం లేదు. ఆమెకు టిక్కెట్ సంగతి అటుంచితే ఆమెకు పార్టీలో ఎంట్రీ కూడా కష్టమేనని పార్టీ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. ఆమెపై నియోజకవర్గంలో ఉన్న అసంతృప్తి అందుకు కారణమంటున్నారు. ఇకమరో ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డికి సయితం ఉదయగిరి టిక్కెట్ టీడీపీ ఇవ్వడం కష్టమేనని చెబుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడం, నియోజకవర్గంలో అసంతృప్తితో కొత్త నేతకు అక్కడ టీడీపీ టిక్కెట్ ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ ఇద్దరు ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్ మాత్రం ఎటూ కాకుండా పోయిందంటున్నారు.

# వైసీపీలోనే విక్రమ్ రెడ్డి

**నెల్లూరు,:**

ఏపీలో వైసీపీకి ఎదురేలేదని అన్నారు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి. ముగ్గురు ఎమ్మెల్యేలు పోయినంత మాత్రాన నెల్లూరు జిల్లాలో పార్టీకి జరిగే నష్టమేమీ లేదని అన్నారాయన. వచ్చే ఎన్నికల్లో కూడా వైసీపీ జిల్లాలో క్లీన్ స్వీప్ చేస్తుందని చెప్పారు. పార్టీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలే తమకు శ్రీరామరక్ష అని అన్నారు ఎమ్మెల్యే విక్రమ్ రెడ్డి. ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత వైసీపీ నలుగురు ఎమ్మెల్యేలపై వేటు వేసిన సంగతి తెలిసిందే. వారితోపాటు మరికొందరు కూడా పార్టీ మారబోతున్నారంటూ పుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఇటీవల కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి పార్టీ మారుతున్నారంటూ వాట్సప్ లో ఓ పోస్టింగ్ హల్ చల్ చేసింది. దానిపై వెంటనే ఎమ్మెల్యే ప్రసన్న రియాక్ట్ అయ్యారు. తన చివరి రక్తపు బొట్టు వరకూ జగన్ కోసమేనని చెప్పారు ప్రసన్న. తనపై చంద్రబాబు తప్పుడు ఆరోపణలు చేయిస్తున్నారని మండిపడ్డారు. ప్రసన్నతోపాటు, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి పేరు కూడా ప్రముఖంగా వినిపించింది. అటు ఉదయగిరి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్ రెడ్డిపై పార్టీ వేటు వేయడంతో ఆయన సోదరుడి కుమారుడు విక్రమ్ రెడ్డి కూడా పార్టీ మారతారని అన్నారు. కానీ అది కూడా వట్టి పుకారేనని ఖండించారు విక్రమ్ రెడ్డి. తప్పుడు ప్రచారం చేసేవాళ్లంతా వీధి కుక్కలని ఘాటు వ్యాఖ్యలు చేశారు. తమ బాబాయ్ చంద్రశేఖర్ రెడ్డి వైసీపీని, అలాగే ఇంటి పేరు వదిలేసి వెళ్తే ఆయన శక్తి ఏంటో ఆయనకు తెలిసి వస్తుందన్నారు విక్రమ్ రెడ్డి. పార్టీ లైన్ దాటితే ఎవరిపైన అయినా చర్యలు తప్పవని చెప్పారు. ఇప్పుడు.. ఎప్పుడూ.. సీఎం జగన్ తోనే మా ప్రయాణం అని అన్నారు. జగన్ ని నేరుగా ఎదుర్కొనే దమ్ము లేకే టీడీపీ తన అనుకూల మీడియాను అడ్డుపెట్టుకుని ప్రచారం చేస్తోందని చెప్పారు. టీడీపీ, ఎల్లో మీడియా ఎవరు కలిసొచ్చినా సరే.. ప్రజల గుండెల్లో పదిలంగా ఉన్న సీఎం జగన్ స్థానాన్ని చెరపలేరన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసినా ఫలితం లేదన్నారాయన. వైసీపీ బహిష్కరించిన ఎమ్మెల్యేలు, టీడీపీలోని కొంతమంది నేతలు కూడా పార్టీ ఫిరాయింపులు జోరుగా ఉంటాయని చెబుతున్నారు. దాదాపు 40మంది వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలోకి వస్తారని అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎవరిపై పుకార్లు వస్తే వారు వివరణ ఇచ్చుకోవాల్సిన పరిస్థితి ఏపీలో ఉంది. ఇప్పటికే చాలామంది ఇలా వివరణలు ఇచ్చుకున్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల తర్వాత రాపాక వరప్రసాద్, మద్దాలి గిరి.. తమకు కూడా డబ్బుల ఆఫర్ వచ్చిందని, తాము తిరస్కరించామని చెప్పుకొచ్చారు. ఆ తర్వాత వైసీపీ ఎమ్మెల్యేలు ఒక్కొక్కరే బయటకొచ్చి, తాము జగన్ తోనే ఉన్నామని చెప్పుకుంటున్నారు. ముఖ్యంగా నెల్లూరు జిల్లా ఎమ్మెల్యేల విషయంలో పుకార్లు ఎక్కువగా రావడం విశేషం.

# కేబినెట్ లోకి స్పీకర్ ...?

**విశాఖపట్టణం:**

ఏపీ మంత్రి వర్గంలో మార్పులు జరుగుతాయని గత కొంతకాలంగా చర్చ నడుస్తోంది. తాజాగా ఈ చర్చను బలపర్చే పరిణామాలు ఏపీలో జరుగుతున్నాయి. ఉత్తరాంధ్రకు చెందిన ఇద్దరు కీలక నేతలకు సీఎంవో నుంచి పిలుపు వచ్చింది. స్పీకర్ తమ్మినేని సీతారాం, మంత్రి సీదిరి అప్పలరాజుతో సీఎం జగన్ తో విడివిడిగా భేటీ అయ్యారు. స్పీకర్ తమ్మినేని సీతారామ్ కు మంత్రి పదవి దక్కే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. మంత్రి సీదిరి అప్పలరాజు చేసిన వ్యాఖ్యలతో ఆయనను మంత్రి వర్గం నుంచి తప్పించే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఏపీలో మరోసారి కేబినెట్ పునర్ వ్యవస్థీకరణ ప్రచారం మొదలైంది. ప్రస్తుత మంత్రివర్గం నుంచి కొందరిని తప్పిస్తారని జోరుగా సాగుతుంది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన మంత్రి సీదిరి అప్పలరాజుకు ఇవాళ సీఎం కార్యాలయం నుంచి పిలుపు రావడంతో ఆయన హుటాహుటిన తాడేపల్లి వచ్చి సీఎం జగన్ ను కలిశారు. అనంతరం మంత్రి సీదిరి అప్పలరాజు కీలక వ్యాఖ్యలు చేశారు. కేబినెట్ లో ఉన్నా లేకపోయినా బాధపడనని మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆయన.. తనకు ప్రజాసేవ ముఖ్యమన్నారు. తనకు మంత్రి పదవి ముఖ్యం కాదని, పదవి నుంచి తొలగిస్తారన్న దానిపై తనకు సమాచారం లేదన్నారు. తన దృష్టిలో వైసీపీ ఎమ్మెల్యేలందరూ మంత్రులేనన్నారు. పదవి నుంచి తొలగిస్తారన్న దానిపై తనకు సమాచారం లేదన్నారు. మంత్రి పదవి కంటే తనకు ప్రజాసేవే ముఖ్యమన్నారు. బీసీల నుంచి వచ్చిన తనకు సీఎం జగన్ మంత్రి పదవి ఇచ్చారన్నారు. మంత్రి సీదిరి అప్పలరాజు తొలి సారి ఎమ్మెల్యేగా గెలిచినప్పటికీ... సీఎం జగన్ మంత్రి పదవి ఇచ్చారు. తొలి సారి ఎమ్మెల్యే ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయినప్పటికీ మోపిదేవి వెంకటరమణకు సీఎం జగన్ మంత్రిపదవి ఇచ్చారు. తర్వాత ఎమ్మెల్సీ ఇచ్చారు. మండలి రద్దు తీర్మానం చేసిన తర్వాత వారిని మంత్రి పదవుల నుంచి తప్పించారు. అదే సామాజికవర్గం నుంచి సీదిరి అప్పలరాజుకు చాన్స్ ఇచ్చారు. మంత్రులందరితో రాజీనామాలు తీసుకున్నప్పుడు సీదిరి అప్పలరాజుతోనూ రాజీనామా చేయించారు.. కానీ మళ్లీ ప్రమాణస్వీకారం చేశారు. దీంతో ఆయన మంత్రి పదవి కంటిన్యూ అవుతున్నారు. సీఎం జగన్ తో స్పీకర్ తమ్మినేని సీతారాం భేటీ అయ్యారు. సీఎం జగన్ తో మంత్రి అప్పలరాజు సమావేశం ముగిసిన అనంతరం తమ్మినేని కలిశారు. స్పీకర్ తమ్మినేని మంత్రి కాబోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. ఉత్తరాంధ్రలో దూకుడుగా వెళ్లేందుకు తమ్మినేనికి సీఎం జగన్ కీలక బాధ్యతలు అప్పగిస్తారని తెలుస్తోంది. స్పీకర్ గా ఉండి కూడా ప్రభుత్వం తరఫున తమ్మినేని పలుమార్లు కీలక వ్యాఖ్యలు? చేశారు. ప్రతిపక్షాలపై పదునైన విమర్శలు చేయడంలో తమ్మినేని ముందుంటున్నారు. మరో మంత్రి బొత్సా తీరుపై సీఎం జగన్ అసహనంగా ఉన్నారని తెలుస్తోంది. మంత్రిగా ఉండి కూడా ఉత్తరాంధ్రలో ఉత్సాహంగా ఉండడంలేదని బొత్సా తీరుపై జగన్ అసంతృప్తిగా ఉన్నట్లు సమాచారం.

# అందుబాటులోకి రోబోటిక్ స్ప్రేయర్లు

**కాకినాడ:**



ఎరువులు, పురుగు మందుల పిచికారీకి సాంకేతిక పరిజ్ఞానం జోడించడమే లక్ష్యంగా వైఎస్సార్ ఉద్యాన విశ్వ?విద్యాలయ అనుబంధ పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్తలు రోబోటిక్ స్ప్రేయర్‌ను అందు?బాటులోకి తీసుకొచ్చారు. దీని సాయంతో పాలీహౌస్, గ్రీన్ హౌస్‌లలో ద్రవ రూప ఎరువులు, పురుగు మందులను మానవ రహితంగా పిచికారీ చేయొచ్చు. పంటలవారీగా శాస్త్రవేత్తల సిఫార్సుల మేరకే నానో యూరియా, పురుగు మందులను ఈ పరికరం పిచికారీ చేస్తుంది. దీనిద్వారా 20 శాతం యూరియా, పురుగుల మందుల వినియోగం తగ్గడంతోపాటు పెట్టుబడి ఖర్చులు 25 శాతం వరకు ఆదా అవుతాయని క్షేత్రస్థాయి అధ్యయనంలో గుర్తించారు. దిగుబడుల్లో నాణ్యత పెరగడంతోపాటు పంట ఉత్పత్తుల్లో రసాయన అవశేషాల ప్రభావం ఉండదని కూడా తేల్చారు. ఈ పరికరం రిమోట్ కంట్రోల్‌తో కిలోమీటర్ మేర పనిచేస్తుంది. ముందుగా కావాల్సిన రసాయన ఎరువు లేదా పురుగు మందులను తొట్టిలో వేసుకుని మెషిన్ ఆన్ చేసి రిసీవర్, ట్రాన్స్‌మిటర్‌ను కనెక్ట్ చేసుకోవాలి. రిమోట్ ద్వారా కమాండ్ సిగ్నల్స్‌ను అందిస్తే ఇది పని చేసుకుంటూ పోతుంది. రిమోట్ ద్వారా మెషిన్ దిశను మార్చుకోవచ్చు. కంట్రోలర్ బటన్ ద్వారా మెషిన్ వేగం, స్ప్రేయర్ పీడనం మార్చుకోవచ్చు. మొక్క ఎత్తును బట్టి నాజిల్స్‌ను మాన్యువల్‌గా సర్దుబాటు చేసుకోవచ్చు. పురుగు మందులను ఏకరీతిన సరైన పరిమాణంతో ఆకుల మీద పడేలా చేయటం దీని ప్రత్యేకత. తక్కువ మోతాదులో వినియోగించడం వల్ల పురుగు మందుల వృథాతో పాటు భూగర్భ జలాలు కలుషితం కాకుండా అడ్డుకోవచ్చు. 10?20 లీటర్ల లిక్విడ్ యూరియా, పురుగుల మందులను మోసుకెళ్తూ నిమిషానికి 6 లీటర్లను పిచికారీ చేయ?గల సామర్థ్యం ఈ పరికరానికి ఉంది.

# ఏపీలో కరెంట్ బాదుడు

**విజయవాడ:**



ఆంధ్రప్రదేశ్ విద్యుత్ వినియోగదారులపై ట్రూ అప్ భారం మోపేందుకు రంగం సిద్ధమైంది. ఇప్పటికే ఏపీలో శ్లాబులు మార్పు, ఫిక్స్‌డ్ ఛార్జీల పెంపు, ట్రూఅప్ భారాల విద్యుల్ పంపిణీ సంస్థలు వేల కోట్ల రూపాయల భారాన్ని మోపాయి. ఇకపై ప్రతి నెల ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేసేందుకు విద్యుత్ పంపిణీ సంస్థలకు అనుమతిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి గత బుధవారం ఉత్తర్వులను విడుదల చేసింది. డిసెంబర్ 29వ తేదీన కేంద్ర విద్యుత్ మంత్రిత్వశాఖ తీసుకొచ్చిన గెజిట్ ఆధారంగా ఎపిఇఆర్‌సి తాజా ఉత్తర్వులను విడుదల చేసింది. ఈఆర్‌సి కార్యదర్శి రాజబాపయ్య గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. విద్యుత్ సంస్థలపై పడుతున్న భారాన్ని తగ్గించుకోడానికి ప్రతి నెల విద్యుత్ వినియోగదారులపై ఆ భారం మోపాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా నెలనెలా ట్రూ అప్ ఛార్జీ వసూలు చేయనున్నారు. ఖర్చులకు అనుగుణంగా ప్రతి నెలా విద్యుత్ ఛార్జీలు పెంచుకునేందుకు డిస్కమ్‌లకు ఈఆర్‌సీ అనుమతి వచ్చింది. ప్రతిరోజూ పెట్రోల్ ధరలు ఎలా పెరుగుతాయో, ఇకపై విద్యుత్ ఛార్జీలూ ప్రతి నెలా పెరగనున్నాయి. గతంలో ఏడాదికొక్కసారి ట్రూఅప్ విధానం ఉండేది. ఛార్జీలు వసూలు చేయాలంటే ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణ జరిపేది. అందరి అభిప్రాయాలూ తీసుకునేది. కేంద్ర ప్రభుత్వ విధానాల్లో భాగంగా ఏడాది విధానాన్ని డిస్కమ్‌లు మూడు నెలలకు మార్చాయి. కేంద్రం గెజిట్‌కు అనుగుణంగా ఫిబ్రవరి 10వ తేదీన ఈ విధానంపై అభ్యంతరాలు, సలహాలు కోరుతూ ముసాయిదాను ఈఆర్‌సి విడుదల చేసింది. కొత్త విధానాన్ని రాజకీయ పార్టీలు, విద్యుత్ రంగ నిపుణులు వ్యతిరేకించినా, అమలు చేయడానికే మొగ్గు చూపింది. ఇకపై అన్ని కేటగిరీలకు యూనిట్‌కు 40 పైసలు చొప్పున ట్రూ అప్ ఛార్జీగా వసూలు చేసుకునే ప్రతిపాదనకు అనుమతిచ్చింది. ఏప్రిల్ ఒకటోతేదీ నుండి ఈ విధానం అమల్లోకి రానుంది. ప్రతి నెలా ఛార్జీల వసూళ్లతో పాటు ఏడాది చివరలో ఇంధన సర్దుబాటు వ్యయం ఛార్జీలకు మించి ఉంటే అదనంగా వసూలు చేసుకునే అవకాశం కూడా డిస్కమ్‌లకు కల్పించింది. ఇకపై ప్రతి నెల ట్రూఅప్ ఛార్జీలతో పాటు, ఏడాది చివరిలో మరో ట్రూఅప్ భారం ప్రజలపై మోపే అధికారం డిస్కంలకు ఉంటుంది. వీటిపై బహిరంగ విచారణ జరపాలన్న నిబంధన కూడా ఏమి లేదు. డిస్కమ్‌లు ఎప్పుడు కావాలంటే అప్పుడు ట్రూఅప్ ధరలను వసూలు చేసుకోవచ్చు. బొగ్గు ధరలు, విద్యుత్ కొనుగోలు ధర, ట్రాన్స్‌మిషన్ ధరలు పెరిగిన ప్రతిసారీ వాటిని వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవచ్చని ఈఆర్‌సి తెలిపింది. ఏపీలో ఇప్పటికే రూ. 2910 కోట్ల ట్రూఅప్ భారాన్ని గతేడాది ఆగస్టు నుంచి డిస్కమ్‌లు ప్రజల నుంచి వసూలు చేస్తున్నాయి. 2024 జనవరి వరకు వీటిని వసూలు చేస్తారు. మరో రూ. 3,083 కోట్ల ట్రూఅప్ ఛార్జీలను ఈ ఏడాది ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకూ వసూలు చేస్తారు. ట్రూఅప్ పేరుతోనే రూ. 5,993 కోట్లను ప్రజల నుంచి డిస్కమ్‌లు వసూలు చేస్తున్నాయి. ఈ వసూళ్లను వ్యతిరేకిస్తూ పలు ప్రజాసంఘాలు, విద్యుత్ నిపుణులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా ఇఆర్‌సి పట్టించుకోలేదు. విద్యుత్ ఛార్జీలను పెంచలేదని చెబుతూనే సర్దుబాటు ఛార్జీల పేరుతో ప్రజలపై భారాలు వేయడం మోసపూరితమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు విమర్శించారు. 2023 ఏప్రిల్ నుంచి కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ప్రతినెలా విద్యుత్ యూనిట్‌కు 40 పైసలు చొప్పున అదనంగా సర్దుబాటు ఛార్జీలు వసూలు చేయడాన్ని తప్పు పట్టారు. ఏడాది చివరిలో అవసరమైతే అదనంగా సర్దుబాటు భారం మోపే ప్రమాదమూ ఉందని ఆరోపించారు. గత సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం రూ. 1400 కోట్లు విద్యుత్ ఛార్జీలు భారం మోపిందని, 2014-19 మధ్య వినియోగించుకున్న విద్యుత్‌కు ఇప్పుడు 36 నెలలపాటు యూనిట్‌కు 25 పైసలు చొప్పున వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల రూ. 2,900 కోట్ల భారం పడిందని వివరించారు. 2020-21లో వినియోగించుకున్న విద్యుత్‌పై యూనిట్‌కు 65 పైసలు

# యదేచ్ఛగా కలప తరలింపు

**ఏలూరు:**

అక్రమార్కులు అడవిని కొల్లగొడుతున్నారు. చెట్ల సంరక్షణకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన వాల్టా చట్టం నీరుగారుతోంది. పర్యావరణ పరిరక్షణ ఉత్తిమాటగానే మిగులిపోతుంది. యథేచ్ఛగా మారుజాతి కలపను నరుకుతూ అక్రమ రవాణా చేస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఏలూరు జిల్లా పశ్చిమ ఏజెన్సీలో ఉన్న బుట్టాయిగూడెం, కన్నాపురం, రెడ్డిగణపవరం ప్రాంతాల్లో అడవులను దుండగులు సర్వనాశనం చేస్తున్నారు. పట్టపగలే దర్జాగా ట్రాక్టర్లు, ఎద్దులబండ్లతో తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పశ్చిమ ఏజెన్సీ బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, కన్నాపురం, రెడ్డి గణపవరం, కొయ్యలగూడెం ప్రాంతాలలో వర్జీనియా పొగాకు పంట అధికంగా పండిస్తారు. ఈ క్రమంలో పొగాకు బ్యారన్ లో కూరింగ్ చేసేందుకు కలప అవసరం. దీన్ని ఆసరాగా చేసుకున్న కొంతమంది అక్రమార్కులు ముందుగానే చేసుకున్న ఒప్పందం మేరకు అడవిలోని చెట్లను నరికేసి మిషన్లతో ముక్కలుగా కోసేసి పొగాకు బేరన్లకు కలపను తరలిస్తున్నారు. ఎద్దుల బండి మారుజాతి పుల్ల రూ. 3 నుంచి 4 వేలు, ట్రాక్టర్ లో అయితే రూ. 10 నుంచి 15 వేలకు విక్రయిస్తున్నారు. భారీ వృక్షాలను సైతం వేళ్ళతో పెగిలించి అనుమతులు లేకుండా అక్రమ మార్గంలో తరలించి జేబులు నింపుకుంటున్నారు. పొగాకు క్యూరింగ్ సీజన్ కావడంతో కడప అక్రమ రవాణాదారులకు కాసుల వర్షం కురుస్తోంది. కలపకు మంచి డిమాండ్ ఉండటంతో ప్రతిరోజు రిజర్వ్ ఫారెస్ట్ లో చొరబడి భారీ వృక్షాలను సైతం నరికివేసి బ్యారన్ లకు తరలిస్తున్నారు. వేప, తుమ్మ చెట్లను సైతం అక్రమార్కులు వదలడంలేదు. చెట్ల నరికివేతపై అధికారుల పర్యవేక్షణ లేకపోవటం వలనే విచ్చలవిడిగా అక్రమార్కులు రెచ్చిపోతూ, పర్యావరణానికి తూట్లు పొడుస్తూ అందినకాడికి దండుకుంటున్నారు. అక్రమ కలప రవాణా స్థానిక అధికారులకు తెలిసే జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమ వ్యాపారం బహిరంగంగా చేపడుతున్నా, కేసులు నమోదు చేయకపోవడంపై అనుమానాలకు బలం చేకూరుస్తున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో పొగాకు బేరన్ ల వద్ద మారుజాతి కలప భారీ స్థాయిలో దర్శనమిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. కలప అక్రమ వ్యాపారం చేస్తున్న వారు నెల వారీ మామూళ్లు అధికారులకు ఇస్తుండవల్లే పట్టించుకోవడం లేదని గిరిజన సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## నిజామాబాద్ లో మళ్ళీ ఫ్లెక్సీ ల కలకలం

**నిజామాబాద్**



నిజామాబాద్ నగరం లో మళ్ళీ ఫ్లెక్సీ లు ల కలకలం రేపాయి. శుక్రవారం నాడు ఎంపి అరవింద్ కు వ్యతిరేకంగా పసుపు బోర్డు పేరిన పలుచోట్ల ఫ్లెక్సిలు దర్శనమిచ్చిన విషయం తెలిసిందే. అయితే, శనివారం ఉదయాన్నే బీఆర్ఎస్ కు వ్యతిరేకంగా ఫ్లెక్సీ లు వెలిసాయి. నిరుద్యోగ భృతి ఎక్కడ అంటూ ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీ లు కనిపించాయి. ప్రజలను ఉచితాలకు అలవాటూ చేస్తున్నారంటూ ఫ్లెక్సీ లులో ముద్రించారు

## కోవూరు లో మహిళ దారుణ హత్య

**నెల్లూరు**



కోవూరులోని సాయిబాబా మందిరం బస్టాండ్ వెనుక సత్యం జి లేఔట్ లో ఓ మహిళ దారుణ హత్యకు గరయింది. సుమారు 40 సంవత్సరాలు గల మహిళను తలపై తీవ్రంగా కొట్టి గాయపరచడంతో మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలం చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ చేస్తున్నారు.

## ఆలయ పుష్కరిణిలో మృతదేహం

**సింహాచలం**



సింహాద్రి అప్పన్న వరాహ పుష్కరిణిలో మృతదేహం తేలింది. మృతుడు ప్రహ్లాదపురం పల్లినారాయణ పురం గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రెండు రోజుల క్రితం ఇంటినుండి వెళ్లిన కొలుసు అప్పలరాజు(42) పుష్కరిణికి చేపల వేటకు వెళ్లినట్లుగా స్థానికులు చెబుతున్నారు. మృతుడు మద్యం సేవించి ఉన్నట్లుగా తెలుస్తోంది..ముఖంపై గాయాలు ఉండటంతో హత్య చేసి ఉంటారని బంధువులు ఆరోపించారు. గోపాలపట్నం పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కె.జి.హెచ్.కు తరలించారు.

## హోంగార్డు పెరేడ్ ను పరిశీలించిన కమాండెంట్

**కడప**



కడప పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరిగిన హోమ్ గార్డ్ పెరేడ్ ను దక్షిణ ప్రాంత హోమ్ గార్డ్ కమాండెంట్ .ఎం.మహేష్ కుమార్ శనివారం తనిఖీ చేసారు. హోంగార్డుల విధుల గురించి, వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకున్నారు. హోమ్ గార్డుల గ్రీవెన్స్ అడిగి తెలుసుకుని పరిష్కరించారు. హోంగార్డులు పాటించాల్సిన నియమాలను జాగ్రత్తలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్.అడిషనల్ ఎస్పీ కృష్ణారావు, ఏ.ఆర్ .డిఎస్పీ రమణయ్య , ఆర్.ఐ. సోమశేఖర్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీలో కారుణ్య నియామకాలు

విజయవాడ

ఏపీఎస్ఆర్టీసీ లో 1,168 మందికి కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు ఇచ్చేందుకు సీఎం జగన్ అంగీకరించారు. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో 34 మందికి జూనియర్ అసిస్టెంట్లుగా, 146 మందికి ఆర్టీసీ కానిస్టేబుళ్లుగా, 175 మందికి కండక్టర్లుగా, 368 మంది డ్రైవర్లుగా, 445 మందికి అసిస్టెంట్ మెకానిక్లుగా ఉద్యోగాలు కల్పించాలని నిర్ణయిస్తూ ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు.

## శ్రీశైలం లో రోడ్డు ప్రమాదం

**శ్రీశైలం**

శ్రీశైల శిఖరం వద్ద మాచర్లకు చెందిన బోలెరో వాహనం అదుపు తప్పి బో?ల్తా పడింది. ఆదే సమయంలో శ్రీశైలం దేవస్థానం పూజారి నడిపిస్తున్నల ద్విచక్ర వాహనాన్ని, డివైడర్ ను ని ఢీకొట్టింది. ఘటనలో పూజారి, బొలేరో వాహనంలోని ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందారు.

## ఫార్మాకంపేనిలపై ఈడీ దాడులు

**హైదరాబాద్**

హైదరాబాదులో శనివారం పలుచోట్ల ఈడి సోదాలు జరిగాయి. ఫార్మా కంపెనీకి సంబంధించిన డైరెక్టర్ల ఇల్లు, కార్యాలయాల్లో ఏకకాలంలో సోదాలు జరిగాయి. దాదాపు 15 బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో సోదాలను ఈడీ అధికారులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. శనివారం తెల్లవారుజాము నుంచి దాడులు కొనసాగాయి. జూబ్లీహిల్స్ మాదాపూర్ లో ఫార్మా కంపెనీ డైరెక్టర్ ల ఇళ్ళల్లో సోదాలు జరిగాయి.

# కడపలో ఏప్రిల్ 30 టెన్షన్

**కడప:**

దివంగత మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ హత్య కేసు విచారణలో జాప్యంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వివేకా హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసేందుకు సీబీఐ డీఐజీ కేఆర్ చౌరాసియా పర్యవేక్షణలో కొత్త ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)ను సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ప్రస్తుత దర్యాప్తు అధికారి రాంసింగ్‌ను తొలగించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం ఆదేశాలు జారీ చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా సిట్ అధికారుల జాబితాను సీబీఐ విడుదల చేసింది. విచారణ అధికారులుగా ఎస్పీ వికాస్ కుమార్, అడిషనల్ ఎస్పీ ముఖేష్ శర్మ, ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీమతి, ఇన్‌స్పెక్టర్ నవీన్ పునియా, సబ్ ఇన్‌స్పెక్టర్ అంకిత్ యాదవ్ వ్యవహరిస్తారని సీబీఐ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సిట్ బృందం డీఐజీ కేఆర్ చౌరాసియా నేతృత్వంలో పని చేస్తుందని.. సీబీఐ డీజీ ఆదేశాల మేరకు వీరంతా పని చేయాల్సి ఉంటుందని సీబీఐ స్పెషల్ క్రైం జోన్ జాయింట్ డైరెక్టర్ విప్లవ్ కుమార్ చౌదరి వెల్లడించారు.మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విచారణ జరిగింది. ఈ విచారణకు సీబీఐ నలుగురు నిందితులను కోర్టుకు హాజరుపరిచింది. దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి, ఎర్ర గంగిరెడ్డి, సునీల్ యాదవ్, ఉమాశంకర్ యాదవ్‌లను కోర్టులో హాజరుపరిచారు. ఇదే సమయంలో తాజా పరిస్థితిపై సీబీఐ మెమో కూడా దాఖలు చేసింది. సీబీఐ స్పెషల్ పీపీ ఈ మెమోను దాఖలు చేశారు. ఇందులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు మారిన సిట్ ఈ కేసును దర్యాప్తు చేయబోతున్నట్లు తెలిపింది. మరోవైపు స్పెషల్ పీపీకి ఈ కేసు విచారణలో సహకరించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వైఎస్ వివేకా కుమార్తె సునీతారెడ్డి తరఫు న్యాయవాది హామీ ఇచ్చారు. ఇరు వాదనలు విన్న సీబీఐ కోర్టు విచారణను వచ్చే నెల 28కి వాయిదా వేసింది. ఇకపోతే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు కొత్త సిట్ బృందం ఏప్రిల్ 30లోపు కేసు విచారణను పూర్తి చేయాల్సి ఉంటుంది. దీంతో రాబోయే నెల రోజుల్లో ఈ హత్య కేసులో ఎలాంటి కీలక పరిణామాలు చోటు చేసుకుంటాయనే ఉత్కంఠ నెలకొంది.

# కలకలం రేపుతున్న సుఖేష్ చంద్రశేఖర్ లేఖ

**హైదరాబాద్:**

బీఆర్ఎస్ కు రూ.75 కోట్లు ఇచ్చానని సుఖేష్ చంద్రశేఖర్ లేఖ రాశారు. మనీలాండరింగ్ కేసులో అరెస్టై తీహార్ జైలులో ఉన్న సుఖేష్ చంద్రశేఖర్ సంచలన లేఖ రాశారు. ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ చెప్పినట్లు బీఆర్ఎస్ కు రూ.15 కోట్లు చొప్పున ఐదుసార్లు రూ.75 కోట్లు ఇచ్చానని లేఖలో తెలిపారు. బీఆర్ఎస్ ఆఫీస్ వద్ద పార్క్ చేసిన రేంజ్ రోవర్ కారులో ఉన్న వ్యక్తికి రూ.15 కోట్లు ఇచ్చానని లేఖలో తెలిపారు. ఈ లేఖ కలకలం రేగుతోంది. త్వరలోనే కేజ్రీవాల్ తో మాట్లాడిన వాట్సాప్ చాట్ బయటపెడతానని సుఖేష్ అన్నారు. త్వరలోనే మరిన్ని అక్రమాలు బయటపెడతానన్నారు. 2020లో బీఆర్ఎస్ ఆఫీస్ వద్దకు వచ్చి రేంజ్ రోవర్ కారులో ఉన్న ఏపీ అనే వ్యక్తికి రూ.15 కోట్లు ఇచ్చినట్లు సుఖేష్ లేఖలో తెలిపారు. కేజ్రీవాల్ టార్గెట్ గా మరోసారి సుఖేష్ తీవ్ర ఆరోపణలు చేశారు. కేజ్రీవాల్, సత్యేంద్రజైన్ చెప్పినట్లు చెప్పినట్లు డబ్బులు చెల్లించినట్లు చెప్పారు. వారంలో కేజ్రీవాల్ తో చేసిన వాట్సాప్ చాటింగ్ విషయాలు బయటకు వస్తాయన్నారు. చాటింగ్ లో కోడ్ పదాలు వాడారన్నారు. 15 కేజీల నెయ్యి పేరిట రూ.15 కోట్లు తరలించానన్నారు. కేజ్రీవాల్ అవినీతి, అక్రమాలు అన్నీ బయటపెడతానని సుఖేష్ అన్నారు. ఢిల్లీ అరవింద్ కేజ్రీవాల్‌తో తాను చేసిన మొత్తం 700 పేజీల వాట్సాప్, టెలిగ్రామ్ చాట్‌లు చేశానని సుఖేష్ చంద్రశేఖర్ లేఖలో తెలిపారు. కేజ్రీవాల్‌కు 75 కోట్లు డెలివరీ చేసినట్లుగా సుఖేష్ తన లాయర్ ద్వారా ఒక లేఖను విడుదల చేశారు. కేజ్రీవాల్ నేను మీకు 2020కి సంబంధించిన చాట్ ట్రైలర్‌ను చూపించబోతున్నానని లేఖలో రాశారు. మిస్టర్ జైన్ సెట్ చేసిన 15 కిలోల నెయ్యి కోడ్, నేను వ్యక్తిగతంగా డెలివరీ చేశానని, మీ తరపున 15 కోట్ల రూపాయలు చెల్లించానని సుఖేష్ అన్నారు. టీఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మద్యం కేసు నిందితుల్లో ఒకరికి ఈ నగదు ఇచ్చినట్లు తెలిపారు. ఈ 15 కిలోల నెయ్యి హైదరాబాద్‌లో చేరవేయాలని కేజ్రీవాల్ కోరినట్లు లేఖలో సుఖేశ్ ఆరోపించారు. ఇప్పటికే 5 నెయ్యి కేసులు హైదరాబాద్‌కు పంపించినట్లుగా చెప్పారు. హైదారబద్‌కు మొత్తం రూ.75 కోట్లు చేరవేశామని పేర్కొన్నారు. ఇటీవల సుఖేష్ చంద్రశేఖర్ ను కోర్టులో హాజరుపరిచినప్పుడు కేజ్రీవాల్ కౌంట్‌డౌన్ స్టార్ట్ అయిందని, ఆయన త్వరలో తీహార్ క్లబ్‌లో వస్తారని జోస్యం చెప్పారు.

# ప్రవీణ్ పెన్ డ్రైవ్ లో 15 క్వశ్చన్ పేపర్లు

**హైదరాబాద్:**

తెలంగాణలో సంచలనంగా మారిన టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. అయితే ఈ కేసులో నిందితుల పెన్‌డ్రైవ్‌లో 15 ప్రశ్న పత్రాలు ఉన్నట్లు సిట్ గుర్తించింది. సిట్ గుర్తించిన ప్రశ్నపత్రాల్లో గ్రూప్-1 ప్రిలిమ్స్; ఏఈఈ సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ పేపర్లు; డీఏవో జనరల్ స్టడీస్, మ్యాథ్స్ పేపర్లు; ఏఈ జనరల్ స్టడీస్, సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ పేపర్లు; ఏఈ సివిల్, ఎలక్ట్రికల్ పేపర్ 2; టౌన్ ప్లానింగ్ పరీక్ష పేపర్లు ఉన్నాయి. అదేవిధంగా జులైలో జరగాల్సిన జేఎల్ ప్రశ్నపత్రాలు నిందితుల పెన్‌డ్రైవ్‌లో లభ్యమయ్యాయి. ఈ కేసులో ఇప్పటికే 15 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. లక్షల రూపాయల డబ్బు చేతులు మారినట్లు సిట్ దర్యాప్తులో వెల్లడైంది. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాల లీకేజీ కేసు రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ వ్యవహారంలో లక్షల్లో డబ్బు చేతులు మారినట్లు ఇప్పటికే సిట్ అధికారుల దర్యాప్తులో తేలడంతో త్వరలోనే ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) రంగంలోకి దిగనుంది. ఈ మేరకు కేసు నమోదుకు ఈడీ అధికారులు ఇప్పటికే ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ప్రశ్నపత్రాల లీకేజీకి సంబంధించి బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో తొలి కేసు నమోదైన సంగతి తెలిసిందే. ఆ తర్వాత దాన్ని సీసీఎస్‌కు బదిలీ చేశారు. ఈ కేసులో ఇప్పటికే 15 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వారిలో కొందరిని కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. గ్రూప్-1 పరీక్షలో 100 మార్కులకు పైగా సాధించిన అభ్యర్థులను సైతం విచారిస్తున్నారు. ఈ వ్యవహారంపై నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా నిధుల మళ్లింపునకు సంబంధించి ఈడీ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించనుంది. దీంతోపాటు సైబరాబాద్ పోలీసులు బయటపెట్టిన డేటా లీకేజీపైనా మరో కేసు ఈడీ నమోదు చేసింది.రాష్ట్రంలో 'గ్రూప్-1' ప్రిలిమ్స్ సహా పలు పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏర్పాటైన 'సిట్' చేపట్టిన దర్యాప్తులో పలు కీలక ఆధారాలు లభించాయి. టీఎస్‌పీఎస్సీ మొత్తం ఏడు పరీక్షలు నిర్వహించగా వాటిలో అయిదు ప్రశ్నపత్రాలు లీక్ అయినట్లు నిర్ధారణ అయింది. వీటన్నింటికి సంబంధించిన లావాదేవీల వివరాలు వెల్లడి కావాల్సి ఉంది. కమిషన్ కార్యదర్శి వద్ద పీఏగా పనిచేస్తున్న ప్రవీణ్.. తన స్నేహితురాలు రేణుకకు ఏఈ ప్రశ్నపత్రం ఇచ్చి ప్రతిఫలంగా రూ.10 లక్షలు తీసుకున్నట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది. రేణుక, ఆమె భర్త డాక్యానాయక్‌లు దీన్ని మరో అయిదుగురికి అమ్ముకొని దాదాపు రూ.25 లక్షల వరకూ వసూలు చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఇంకొందరికీ ప్రశ్నపత్రం అమ్ముకొని ఉండవచ్చని భావిస్తున్నారు. గ్రూప్-1 ప్రశ్నపత్రానికి సంబంధించిన లావాదేవీల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. ఈ లావాదేవీల గుట్టు రట్టు చేసేందుకే ఈడీ రంగంలోకి దిగుతోంది. ప్రశ్నపత్రాల లీకేజీపై రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు వెల్లువెత్తుతున్న తరుణంలో ఈ తాజా పరిణామం చోటుచేసుకోనుడడం గమనార్హం. పేపర్ లీకేజీ వ్యవహారంపై రంగంలోకి దిగాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇఅ) భావిస్తోంది. లక్షల రూపాయలు చేతులు మారినట్టు గుర్తించిన ఈడీ.. అవన్నీ హవాలా మార్గంలో నడిచాయని అనుమానిస్తోంది. ఇప్పటికే పోలీసుల నుంచి పూర్తి వివరాలు సేకరించింది. సిట్ నుంచి ఈఎఖీ తీసుకుని, ఇఅఎఖీ నమోదు చేసి, సిట్ దర్యాప్తు జరిపిన పత్రాలను కోర్టు నుంచి తీసుకునే ఆలోచనలో ఈడీ ఉంది. ఈ కేసులో సిట్ దర్యాప్తు ముమ్మరంగా జరిపిందని ఈడీ భావిస్తోంది. జైల్లో వున్న నిందితులను విచారిస్తే ఆర్థిక లావాదేవీలు, హవాలా ట్రాన్సాక్షన్స్ అన్నీ బయట పడతాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు భావిస్తున్నారు.

# వేసవిలో త్రాగునీటి సమస్య లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి

**నంద్యాల**

నంద్యాల పట్టణంలో ప్రజల త్రాగునీటి సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలను చేపట్టాలని నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే సహించేది లేదని ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి అన్నారు.

శనివారం జరిగిన మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో అయన మాట్లాడారు. నంద్యాల పట్టణ అభివృద్ధి, చేపట్టవలసిన పనులు సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలు అధికారులకు తగిన సూచనలు, ఆదేశాలను ఎమ్మెల్యే ఇచ్చారు. ఎజెండాలోని న అంశాలను మున్సిపల్ కౌన్సిల్ ఏకగ్రీవ ఆమోదం అమోదించింది. ప్రధానంగా నీటి సమస్యపై సుదీర్ఘంగా చర్చ సాగింది. నంద్యాల ప్రజలకు నీటి సమస్య రాకుండా చూడాలని, ప్రత్యేక దృష్టి సారించి శాశ్వత పరిష్కారం చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. వివిధ వార్డులకు చెందిన కౌన్సిలర్లు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా వాటిని త్వరలో పరిష్కరిస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ తెలియజేసారు. పట్టణంలో పార్కుల అభివృద్ధి చేపడుతున్నామని, ఆ పార్కులకు దేశ నాయకుల పేర్లు మహనీయుల పేర్లను పెట్టేందుకు ప్రతిపాదనలు పెట్టాలని ఎమ్మెల్యే కమిషనర్ ను సూచించారు. ??పార్కుల నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీలు వేయాలని సూచించారు.

## వితంతువు హత్య

**పరిగి**

ఓ మహిళతో సహజీవనం గడుపుతున్న ఓ వ్యక్తి అర్ధరాత్రి మద్యం మత్తులో గొడవ పడి తాడుతో గొంతు నులిమి హత్య చేసిన ఘటన పరిగి మండలం లో రూప్ ఖాన్ పెట్ గ్రామంలో చోటుచేసుకుంది.వికారాబాద్ జిల్లా పరిగి మండలం రూప్ ఖాన్ పేట్ గ్రామానికి చెందిన శ్యామలమ్మ గత పది సంవత్సరాల క్రితం దాదాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగి భర్త ,కొడుకు మరణించడంతో తిరిగి తన గ్రామం రూప్ ఖాన్ పేట్ కు తిరిగి వచ్చి ఉంటున్న సమయంలో తలకొండపల్లి మండలానికి చెందిన చంద్రమౌళితో పరిచయమై అతనితో ఎనిమిది సంవత్సరాలుగా సహజీవనం గడుపుతుంది. తరచూ ఇద్దరూ ఘర్షణ పడేవారని గ్రామస్థులు అంటున్నారు. శుక్రవారం అర్ధరాత్రి ఇద్దరు మద్యం సేవించారు. ఒకరిపై ఒకరు గొడవ పడ్డారు. ఆ గొడవలో మత్తులో తాడుతో గొంతు నులిమి శ్యామలమ్మను హత్య చేశాడు చంద్రమౌళి. హత్య అనంతరం మృతురాలి బంధువులకు,మృతురాలి తమ్ముడికి ఫోన్ చేసి శ్యామలమ్మ పడుకునే చోటే చనిపోయింది. లేవడం లేదని సమాచారం ఇచ్చి పారిపోయాడు. బంధువులు, ఆమె తమ్ముడు ఇంటికి వచ్చి ఆమె చనిపోయిందని నిర్ధారించుకున్నారు. పారిపోయిన చంద్రమౌళిని పట్టుకొని వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చంద్రమౌళిని అదుపులోకి తీసుకొని విచారించారు. నిన్న రాత్రి ఇద్దరం మద్యం సేవించామని అర్ధరాత్రి వరకు గొడవపడ్డామని ఆ తర్వాత మద్యం మత్తులో ఏం చేశానో నాకు తెలియదని పోలీసులకు తెలిపినట్లు సమాచారం. చంద్రమౌళిని అదుపులోకి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## డబల్ బెడ్ రూమ్ లబ్ధిదారుల అందోళన

సూర్యాపేట

సూర్యాపేట జిల్లా మునగాల మండలం, ఆకుపాముల లో రెండు పడక గదుల లబ్ధిదారులు అందోళనకు దిగారు. గ్రామపంచాయతీ కార్యాలయంలోకి వెళ్లకుండా ముళ్ళ కంప అడ్డుగవేసి ధర్నాకు దిగారు. -కార్యాలయం ముందు టెంట్ వేసుకుని ధర్నా చేసారు. గ్రామంలో నిర్మించిన రెండు పడక గదుల పంపిణీలో అవకతవకలు జరిగాయని ఆందోళనకు దిగారు. గ్రామపంచాయతీ ఆవరణలో కాకుండా.. కోదాడ పట్టణంలో.. పోలీస్ పహారాలో డ్రా తీయడం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు, అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతున్నారని లబ్ధిదారుల ఆరోపించారు. అధికార పార్టీ సర్పంచ్ దిష్టిబొమ్మ దగ్ధం చేసారు....

## బీఆర్ఎస్ తో పొత్తు అనలేదు

**హైదరాబాద్**

బీఆర్ ఎస్ తో కాంగ్రెస్ పొత్తు వుంటుందని తాను చెప్పలేదని మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి వివరణ ఇచ్చారు.

ఇటీవల జరిగిన ప్రెస్ మీట్ లో దేశంలో ప్రజాస్వామ్యాన్ని బీజేపీ.ప్రభుత్వం ఖునీ చేస్తున్న అంశం, రాహుల్ గాంధీ పై ఎంపీ గా అనర్హత వేటు వేయడం, ఆధాని లాంటి వాళ్ళు ప్రజాధనాన్ని లక్షల కోట్లు దోచుకొని పోవడం లాంటి అంశగాలపై మాట్లాడడం జరిగిందని అయన అన్నారు.

ఈ సందర్భంగా మీడియా ప్రతినిధులు పొత్తులపై ప్రస్తావించినపుడు నేను క్లుప్తంగా మాట్లాడాను. ప్రజాస్వామ్య పరిరక్షణకు బీజేపీ కి వ్యతిరేకంగా 17 రాజకీయ పార్టీలు కాంగ్రెస్ తో కలిసి పోరాటం చేస్తున్నాయని ఆ అంశాన్ని స్వాగతిస్తున్నానని మాత్రమే చెప్పాను. నేను బీఆర్ ఎస్ తో పొత్తు ఉంటుందని చెప్పలేదు. పోతుల విషయం అధిష్టానం నిర్ణయం మేరకు ఉంటుంది. అధిష్టానం నిర్ణయమే మాకు శిరోధార్యమని అయన అన్నారు.

## తెనాలి బంద్ కు ఉద్రిక్తత

**తెనాలి**

తెనాలి బంద్ కార్యక్రమంలో భాగంగా ఆర్యవైశ్య సంఘాలు, టీడీపీ శ్రేణులు పట్టణంలో ర్యాలీ చేపట్టాయి. శుక్రవారం కౌన్సిల్ సమావేశంలో ఆర్యవైశుడు టీడీపీ కౌన్సిలర్ యుగంధర్ పై దాడికి నిరసనగా తెనాలి బంద్ పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే.

మరోవైపు తెనాలి మున్సిపల్ కార్యాలయం వద్ద వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ నిరసన జరిగింది. కౌన్సిల్ సమావేశంలో వైసిపి కౌన్సిలర్ పై టిడిపి కౌన్సిలర్ల దాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కి అనుమతులు లేవని పోలీసులు అడ్డుకున్నారు. ము సూచించిన దారిలోనే ర్యాలీ వెళ్లాలని పోలీసులు ఆదేశం ఇవ్వడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం రేగింది. స్థానిక మార్కెట్ లోకి వెళ్లకుండా అడ్డుకోవటంతో వేరే వైపు ర్యాలీ మళ్లించారు. నిరసన వ్యక్తం చేస్తున్న వాళ్ళని అరెస్ట్ చేసి క్రమంలో తీవ్ర తోపులాటకు దారి తీసింది.

## బీఆర్ఎస్ సమావేశంలో ఘర్షణ

**మెదక్**

మెదక్ జిల్లా మనోహరాబాద్ మండల కేంద్రంలో బిఆరెస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనంలో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. శనివారం ఉదయం జరిగిన ఈ కార్యక్రమంలో క వర్గం ఉద్యమకారులను పట్టించుకోవడం లేదని మండిపడింది. మరో వర్గంతో తీవ్ర వాగ్వాదానికి దిగింది. ఒక కార్యకర్తను స్టేజి మీద నుండి తొస్తుండగా తోపులాట చోటుచేసుకుంది. చివరకు రెండు వర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది.

# 4 వేల లీటర్ల పాల ఉత్పత్తి దిశగా...

**తిరుమల:**

తిరుమల శ్రీవారిని పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. శుక్రవారం ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో ఏపీ హైకోర్టు జడ్జిలు జస్టిస్ సోమయాజులు, జస్టిస్ సుజాత, గవర్నమెంట్ విప్ కోరుముట్ల శ్రీనివాసులు, ఎమ్మెల్యే గిరిధర్ వేర్వేరుగా స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం వీరికి రంగనాయక మండపంలో వేద పండితులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు. తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టీటీడీకి రోజు వారి అవసరమయ్యే 4వేల లీటర్ల పాలను ఎస్వీ గోశాలలోనే ఉత్పత్తి చేసుకునే దిశగా కార్యాచరణ అమలు చేస్తున్నామని టీటీడీ ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి చెప్పారు. టీటీడీ తయారు చేస్తున్న అగర బత్తీల ఉత్పత్తిని డిమాండ్ కు తగినట్లుగా పెంచే చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్వీ గోశాలలో నిర్మించిన ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్, టీటీడీ ఆలయాల్లో ఉపయోగించిన పువ్వులతో తయారు చేసే అగరబత్తుల రెండవ యూనిట్ ను శుక్రవారం టీటీడీ ఛైర్మన్ వైవి. సుబ్బారెడ్డి, ఈవో.ఏవి ధర్మారెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయంతో పాటు, తిరుమల, తిరుపతిలోని అనుబంధ ఆలయాల నిత్య కైంకర్యాలకు అవసరమయ్యే స్వచ్ఛమైన పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, సొంతంగా తయారు చేసుకోవాలని టీటీడీ పాలకమండలి నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకోసం దేశవాళీ గోవుల పెంపకం, దేశవాళీ గో జాతులను అభివృద్ధి చేయడానికి అనేక ప్రణాళికలు తయారు చేసి వాటిని అమలు చేయడం జరిగిందన్నారులేగ దూడల పెంపకం, గోవుల పెరుగుదల, వాటి ఆరోగ్యం, పునరుత్పత్తి, నాణ్యమైన పాల ఉత్పత్తికి మనం గోవులకు అందించే మేతకు అవినాభావ సంబంధం ఉంటుందన్నారు. ఈ విషయంలో మెరుగైన ఫలితాలు సాధించడానికి, దేశవాళీ గోసంతతిని మరింత అభివృద్ధి చేయడం కోసం వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, అమెరికాకు చెందిన న్యూటెక్ బయోసైన్సెస్ సంస్థతో మూడు రకాల ఫార్ములాలతో కల్తీ లేని నాణ్యమైన పశువుల దాణా సొంతంగా తయారు చేసుకోవడానికి ఎంఓయూ కుదుర్చుకోవడం జరిగిందన్నారు. ఇందుకోసం రూ.11 కోట్లతో టీటీడీ సొంతంగా ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ నిర్మించుకుందని, ఇందులో దాత ఒకరు రూ 2 కోట్లు విరాళం అందించారని తెలిపారు. ఈ ప్లాంట్‌లో ఈ రోజు నుంచే దాణా ఉత్పత్తి జరుగుతుందని, టీటీడీ అవసరాలకు రోజుకు అవసరమయ్యే నాలుగు వేల లీటర్ల పాలను గోశాలలోనే ఉత్పత్తి చేయడం కోసం ఫీడ్ మిక్సింగ్ ప్లాంట్ ఎంతో ఉపయోగపడుతుందని ఆయన తెలియజేశారు. గోవులకు బలవర్ధకమైన సమగ్ర దాణా అందించడం ద్వారా పాల ఉత్పత్తి ఇప్పటి కంటే 10 నుంచి 15 శాతం పెరుగుతుందని, ఇక్కడ తయారు చేసే సమగ్ర దాణాను గోవులకు అందించడం వల్ల పాల ఉత్పత్తి పెరగడంతో పాటు గోవులు ఇచ్చే పాలలో ప్రొటీన్ శాతం మరింత అధికంగా లభిస్తుందని ఆయన అన్నారు. దీనివల్ల టీటీడీకి ప్రతి రోజు అవసరమయ్యే 4 వేల లీటర్ల పాల అవసరాన్ని దశలవారీగా చేరుకునే అవకాశం లభిస్తుందని, దేశవాళీ గోజాతులను అభివృద్ధి చేయడం కోసం దాతల సహకారంతో 500 దేశవాళీ గోవులను సమీకరించాలని నిర్ణయించాంమని, ఇందులో భాగంగా రాజస్థాన్ నుంచి ఇప్పటి వరకు 120కి పైగా గిర్, కాంక్రీజ్ దేశవాళీ జాతుల గోవులను తీసుకుని వచ్చాంమని టీటీడీ ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి తెలిపారు. టీటీడీ ఆలయాల్లో ఉపయోగించిన పువ్వులతో పరిమళభరితమైన అగరబత్తులను తయారు చేసి భక్తులకు అందించేందుకు టీటీడీ ముందుకు వచ్చిందని తెలిపిన టిటిడి ఛైర్మన్, బెంగళూరుకు చెందిన దర్శన్ ఇంటర్నేషనల్ సంస్థ సహకారంతో 2021 సెప్టెంబరు 13వ తేదీన టీటీడీ ఈ అగరబత్తులను తయారు చేసి భక్తులకు అందుబాటులోనికి తీసుకు వచ్చిందన్నారు. ఇప్పటి వరకు రూ.30.66 కోట్ల విలువైన అగరబత్తులను భక్తులకు విక్రయించడం జరిగిందన్నారు. ఈ అగర్బత్తులకు భక్తుల నుంచి విపరీతమైన డిమాండ్ రావడంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని రెండింతలు చేయాలని నిర్ణయించామని, ఇందుకోసం ప్రస్తుతం ఉన్న ప్లాంట్ వద్దే రూ 2 కోట్లతో రెండవ యూనిట్ సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం రోజుకు 15 వేల అగరబత్తుల ప్యాకెట్లు తయారు అవుతున్నాయని, రెండో యూనిట్ ప్రారంభించడం వల్ల ఈ సంఖ్య రోజుకు 30 వేల ప్యాకెట్లకు పెరుగుతుందన్నారు. దీనివల్ల సుమారు 200 మంది స్థానిక మహిళలకు ఉపాధి లభిస్తోందని, భక్తులు శ్రీవారి లడ్డు ప్రసాదంతోపాటు అగరబత్తులను కూడా ప్రసాదంగా అందించడానికి ముందుకొస్తున్నారని వివరించారు. రాబోయే రోజుల్లో స్వామి వారి అగరబత్తులు ప్రతి భక్తుడికి చేరే అవకాశం ఉందన్నారు. డిమాండ్‌కు తగినట్టు ఉత్పత్తిని కూడా పెంచే దిశగా ఏర్పాట్లు చేస్తామని వైవీ.సుబ్బారెడ్డి పేర్కొన్నారు. నరసింగాపురంలోని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద ఫార్మసీలో నూతనంగా నిర్మించిన ఔషధ ఉత్పత్తుల తయారీ కేంద్రాన్ని టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి ప్రారంభించారు. అర్చకులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించిన అనంతరం ఛైర్మన్, ఈవో నూతన భవనంతోపాటు మందుల ఉత్పత్తిని లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. పూర్వీకులు మనకు అందించిన ప్రాచీన ఆయుర్వేద వైద్యాన్ని అభివృద్ధి చేయడానికి టీటీడీ ఎంతో కృషి చేస్తోందని ఆయన తెలిపారు. ఇందులో భాగంగా 1983లో ఆయుర్వేద వైద్య కళాశాలను, దానికి అనుబంధంగా ఆయుర్వేద ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయుర్వేద ఆసుపత్రి దినదినాభివృద్ధి చెందుతూ ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఇక్కడికి వస్తున్న రోగులకు అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తోందన్నారు. ఆయుర్వేద ఆసుపత్రికి అవసరమయ్యే మందులు సొంతంగా తయారు చేసుకోవడం కోసం నరసింగాపురంలో 1990వ సంవత్సరంలో 14.75 ఎకరాల్లో టీటీడీ ఆయుర్వేద ఫార్మసీని ఏర్పాటు చేసిందని ఆయన తెలిపారు. మొదట 10 రకాల మందులు మాత్రమే తయారు చేసిన ఈ ఫార్మసీ క్రమేణా 80 రకాల మందులు తయారు చేసి ఆయుర్వేద ఆసుపత్రితో పాటు తిరుపతి, తిరుమలలో డిస్పెన్సరీలకు సరఫరా చేస్తోందన్నారు. ఫార్మసీని మరింత అభివృద్ధి చేసి ఆయుర్వేద వైద్యాన్ని మరింతగా ప్రజలకు చేరువ చేయడానికి మా పాలక మండలి నిర్ణయించిందని ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి వివరించారు. ఇందుకోసం ఫార్మసీ భవనాలనూ ఆధునీకరించడంతో పాటు, మూడు ఔషధ ఉత్పత్తి కేంద్రాలను నిర్మించి రూ.3.90 కోట్లతో అధునాతన యంత్ర పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఇందులో మొదట విడతగా తొలి ఔషధ ఉత్పత్తి కేంద్రం శుక్రవారం ప్రారంభించినట్లు సుబ్బారెడ్డి చెప్పారు. ఇప్పటి దాకా సంవత్సరానికి రూ.1.5 కోట్లు విలువ గల మందులను తయారు చేసే ఈ ఫార్మసీలో ఉత్పత్తి సామర్థ్యం పెరిగి ఏడాదికి రూ.5 కోట్ల విలువ చేసే మందులను తయారు చేసే సామర్థ్యం లభిస్తుందని ఆయన వివరించారు. ఇక్కడ తయారు చేసే ఆయుర్వేద మందులను టీటీడీ అవసరాలకు పోను, మిగిలినవి ఆయుష్ వైద్య శాలలకు విక్రయించేలా రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం జరిగిందని ఛైర్మన్ చెప్పారు. కొన్ని ప్రత్యేకమైన, ప్రాచుర్యం పొందిన మందులను టీటీడీ విక్రయశాలల్లో ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఆలోచిస్తున్నామని ఆయన చెప్పారు. శుక్రవారం ప్రారంభించిన ఉత్పత్తి కేంద్రంలో మొదటి విడతగా 10 రకాల ఔషధాలు తయారు చేస్తారన్నారు. భవిష్యత్‌లో 314 నూతన ఔషధాలు తయారు చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

# ఎమ్మెల్యే స్టిక్కర్లు విక్రయాలా..?

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఎమ్మెల్యేల వాహనాలకు కేటాయించే స్టిక్కర్లపై వివాదం చెలరేగుతోంది. వరుసగా ఎమ్మెల్యేల స్టిక్కర్లు వివాదాస్పద వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడం దుమారం రేపుతోంది. మొన్న మంత్రి మల్లారెడ్డికి సంబంధించిన స్టిక్కర్ వివాదాస్పదం కాగా తాజాగా మైలార్ దేవులపల్లి శాస్త్రిపురంలో వెలుగు చూసిన ప్రభుత్వ భూకబ్జా వ్యవహారంలో కబ్జాకోరుల కారుపై తాండూరు ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ స్టిక్కర్ ఉండటం అనుమానాలకు తావిస్తోంది. దీంతో భూకబ్జాకు ప్రయత్నించింది ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి మనుషులేనా? అసలు ఆ కార్లు ఎవరివి? ఒక వేళ ఆ కార్లు రోహిత్ రెడ్డివి కాకపోతే ఆ స్టిక్కర్లు ఆ కార్లపైకి ఎలా వచ్చాయనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే ఈ అంశంపై స్పందించిన పైలెట్ రోహిత్ రెడ్డి ఈ భూ కబ్జా వ్యవహారంతో తనకు సంబంధం లేని స్పష్టం చేశారు. ఆ స్టిక్కర్ల వ్యవహారం కూడా తాను మీడియాలో చూసి తెలుసుకున్నానని వాటితోనూ తనకు సంబంధం లేదని తేల్చారు. పాత స్టిక్కర్లు వారి వద్దకు ఎలా చేరాయనేది తాను ఆరా తీస్తున్నానని, అలాగే స్టిక్కర్లు వాడిన వారిని గుర్తించాలని పోలీసులను కోరినట్లు తెలిపారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే స్టిక్కర్లపై వరుసగా వివాదాలు చెలరేగుతున్నాయి. ఏడాది క్రితం బోధన్ ఎమ్మెల్యే షకీల్‌కు కేటాయించిన ఎమ్మెల్యే స్టిక్కర్ కలిగి ఉన్న ఓ కారు బంజారాహిల్స్ రోడ్డుపై బీభత్సం సృష్టించింది. ఈ కారు ఓ మహిళను ఢీ కొట్టడంతో మహిళ చేతిలో ఉన్న పాప ప్రాణాలు కోల్పోయింది. మరో వైపు రాజకీయ వర్గాల్లో తీవ్ర దుమారం రేపిన క్యాసినో నిర్వాహకుడు చీకోటి ప్రవీణ్ వ్యాపార భాగస్వామిగా చెప్పబడుతున్న బోయినపల్లి మాధవరెడ్డి కారుకు మంత్రి మల్లారెడ్డికి చెందిన స్టిక్కర్లు దర్శనం ఇవ్వడం కలకలం రేపింది. ఆ సమయంలో మంత్రి స్పందిస్తూ తానే పడేసిన ఆ స్టిక్కర్‌ను ఎవరో పెట్టుకుంటే నాకేంటి సంబంధం అని ఎదురు ప్రశ్నించడం హాట్ టాపిక్ అయింది. ఈ తరహా వ్యవహారం అంతా సద్దుమణిగిందని భావిస్తున్న తరుణంలో మరో సారి అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేరుతో ఉన్న స్టిక్కర్లను ఏకంగా భూ కబ్జాదారులు తమ వాహనాలపై ఉపయోగించడం రాజకీయ వర్గాల్లో చర్చగా మారింది. ఎమ్మెల్యేలకు ప్రభుత్వం కేటాయిస్తున్న స్టిక్కర్ల విషయంలో అజాగ్రత్తగా ఉంటున్నారా లేక ఉద్దేశపూర్వకంగానే ఇతరుల చేతికి అందజేస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇలాంటి సంఘటనలు బయటకు వచ్చినప్పుడు పోలీసులకు ఫిర్యాదు పేరుతో హడావుడి చేయడం, ఆ తర్వాత సైలెంట్ అయిపోవడం మామూలు విషయంగా మారిపోయిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా ఎమ్మెల్యేలు తమకు ప్రభుత్వం కేటాయించిన స్టిక్కర్ల విషయంలో జాగ్రత్త వహించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి

# పలు ట్రోలింగ్ ఛానళ్లకు షాక్

**హైదరాబాద్:**

పలు ట్రోలింగ్ ఛానళ్లకు షాక్ ఇచ్చారు హైదరాబాద్ పోలీసులు. అసభ్యకరమైన పోస్టులు చేసిన 20 ఛానళ్లపై కేసులు నమోదు చేసినట్లు హైదరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీ స్నేహ మెహ్రా వెల్లడించారు. మరో 8 మందికి 41ఏ సీఆర్పీసీ నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ 'ట్రోలర్స్'లో ఎక్కువ మంది 20 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న యువకులేననీ చెప్పారు. ప్రజాప్రతినిధులపై మార్ఫింగ్ వీడియోలతో అభ్యంతరకర, పరువు నష్టం కలిగించే కంటెంట్ ను పోస్ట్ చేస్తున్నారని డీసీపీ స్నేహ మెహ్రా పేర్కొన్నారు. సబ్‌స్క్రైబర్లను పెంచుకోవడం, ఎక్కువ వ్యూస్ రావటం కోసం ఇలాంటివి చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. మార్ఫింగ్ చేయడం చట్టరీత్యా నేరమని స్పష్టం చేశారు. ఇటీవల ఎమ్మెల్సీ కవితను కించపర్చే విధంగా ట్రోలింగ్ జరిగిందని... ఆ ట్రోలర్ ను కూడా గుర్తించామని చెప్పారు. అరెస్ట్ అయినవారిలో అట్టాడ శ్రీనివాస రావు, చిరసాని మణికంఠ, బద్దంజి శ్రవణ్, మోతం శ్రీను, పెరిక నాగవెంకట కిరణ్, వడ్లూరి నవీన్, బొల్లి చంద్రశేఖర్, బిల్ల శ్రీకాంత్ ఉన్నారు. వీరిలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వారు ఉండగా? మరికొందరు తెలంగాణకు చెందిన వారు ఉన్నారు. ప్రధానంగా మహిళలను కించపరిచే విధంగా ట్రోల్స్, మీమ్స్ చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు స్పష్టం చేశారు.

# సీపీఆర్ తో ప్రాణాలు కాపాడుతున్నారు

**హైదరాబాద్:**

గత కొన్ని రోజులుగా కార్డియాక్ అరెస్ట్, గుండెపోటు మరణాలు పెరిగిపోతున్నాయి. ఈ క్రమంలో గురువారం నాడు రెండు వేర్వేరు చోట్ల సీపీఆర్ చేసి ఇద్దరు వ్యక్తుల ప్రాణాలు కాపాడే ప్రయత్నం చేసిన సీఐని, 108 సిబ్బందిని మంత్రి హరీష్ రావు అభినందించారు. అత్యవసర సమయంలో సమయస్ఫూర్తితో వ్యవహరించి సీపీఆర్ చేసి ప్రాణాలు కాపాడుతున్న రియల్ హీరోలకు అభినందనలు అని ట్వీట్ చేశారు. కుకునూర్ పల్లి మండలం, చిన్న కిష్టాపురానికి చెందిన రాజు అనే యువకుడి ప్రాణాలను 108 సిబ్బంది సీపీఆర్ చేసి కాపాడగా, హైదరాబాద్ హయత్ నగర్ లో కారు నడుపుతూ గుండెపోటుకు గురైన వ్యక్తికి సీపీఆర్ చేసి రాచకొండ పరిధిలోని రామన్నపేట సీఐ మానవత్వం చాటుకున్నారు అని మంత్రి హరీష్ రావు వారిని అభినందించారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా సీపీఆర్ శిక్షణ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నది. సీపీఆర్ పై ప్రతి ఒక్కరికీ అవగాహన పెరిగితే ఎంతోమంది ప్రాణాలను కాపాడవచ్చు. చఅఖఖీ అని మంత్రి హరీష్ రావు పోస్ట్ చేశారు. హైదరాబాద్ లోని మలక్ పేట్ కి చెందిన కావలి శ్రీనివాస్ (42), మంగమ్మ భార్యాభర్తలు. వీరికి సంతానం ఇద్దరు పిల్లలు ఉన్నారు. శ్రీనివాస్ తన కుటుంబంతో పాటు హయత్ నగర్ లో అద్దెకు నివాసం ఉంటున్నాడు. క్యాబ్ నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు శ్రీనివాస్. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం సమయంలో ఓ కుటుంబాన్ని యాదగిరిగుట్టకు తీసుకెళుతున్నాడు. ఓఆర్ఆర్ ఎగ్జిట్ దాటిన తరువాత క్యాబ్ డ్రైవర్ శ్రీనివాస్ కు ఛాతీలో నొప్పి వచ్చింది. దాంతో క్యాబ్ లోనే ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. క్యాబ్ లో ఉన్న ప్యాసింజర్ అప్రమత్తమై స్టీరింగ్ ను కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించింది. అదే సమయంలో అటుగా వెళ్తున్న రామన్నపేట సిఐ మోతీరాం కారు నెమ్మదిగా వెళ్లడం గమనించారు. కారును చేరుకుని గమనించగా.. వెనుక సీట్లో ఉన్న మహిళ స్టీరింగ్ కంట్రోల్ చేస్తోంది. అప్రమత్తమైన సీఐ మరో వ్యక్తి సహాయంతోఆ కారును నియంత్రించారు. వెంటనే కారులో నుంచి డ్రైవర్ శ్రీనివాస్ ను బయటకు తీశారు. సీఐ మోతీరాం సీపీఆర్ చేయగా శ్రీనివాస్ స్పృహలోకి వచ్చాడు. చికిత్స కోసం సీఐ తన వాహనంలోనే శ్రీనివాస్ ను హయత్ నగర్ లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. డ్రైవర్ ను పరిశీలించిన డాక్టర్లు అప్పటికే అతను మృతి చెందినట్లుగా నిర్ధారించినట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమై సీపీఆర్ చేసినా ప్రాణాలు దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కుకునూర్ పల్లి మండలం చిన్నకిష్టాపూర్ గ్రామానికి చెందిన పర్వతంరాజు డ్రైవర్ గా చేస్తున్నాడు. గురువారం చిన్నకిష్టపూర్ నుంచి కుకునూర్ పల్లికి వస్తుండగా ఆటో నడపుతున్న పర్వతంరాజుకు ఛాతీలో నొప్పి రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. ఇది గమనించిన ఓ వ్యక్తి 108 కి సమాచారం అందించాడు. కొండపాక 108 సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. మెడికల్ టెక్నీషియన్ మహేందర్ ఆ వ్యక్తికి సీపీఆర్ చేయగా స్పృహలోకి వచ్చాడు. మెరుగైన వైద్యం కోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాణాలు కాపాడిన మెడికల్ టెక్నీషియన్ మహేందర్, పైలెట్ రమేష్ లను అందరూ అభినందించారు.

# మెట్రో రాయితీల్లో కోత

**హైదరాబాద్:**

హైదరాబాద్ వాసులకు మెట్రో రైల్ అధికారులు షాక్ ఇచ్చారు. మెట్రో రాయితీలలో కోత విధిస్తున్నట్లు మెట్రో అధికారులు ప్రకటించారు. మెట్రో రద్దీ ఎక్కువగా ఉన్న సమయాల్లో రాయితీ ఎత్తివేయనున్నట్లు వెల్లడించారు. సూపర్ సేవర్ హాలీడే కార్డు ఛార్జీలు పెంచనున్నట్లు తెలిపారు. మెట్రో కార్డు, క్యూఆర్ కోడ్‌పై ఇప్పటి వరకు ప్రయాణ ఛార్జీల్లో 10 శాతం రాయితీ ఇచ్చేవారు. ఇప్పుడు ఈ డిస్కౌంట్ పై కోత విధించనున్నారు. శనివారం నుంచి ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు రాయితీ ఉండదని ప్రకటించారు. రాత్రి 8 గంటల నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రయాణికులకు రాయితీ వర్తిస్తుందని మెట్రో అధికారులు తెలిపారు. సెలవు రోజుల్లో ప్రయాణించే హాలిడే కార్డు రూ.59 ధరను రూ.99కి పెంచుతున్నట్లు ప్రకటించారు. అదే విధంగా కాంటాక్ట్ లెస్ స్మార్ట్ కార్డుల ధరను కూడా పెంచుతున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం మెట్రో ప్రయాణికులకు అందుబాటులోని కాంటాక్ట్ లెస్ స్మార్ట్ కార్డ్స్, డిజిటల్ క్యూఆర్ టికెట్స్‌పై ఉన్న 10 శాతం రాయితీలను తొలగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ సీఎస్సీ, క్యూఆర్ టికెట్స్ రాయితీలు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వర్తించవని మెట్రో అధికారులు తెలిపారు. హైదరాబాద్ మెట్రోలో ప్రతి రోజుకు 4.4 లక్షల మంది ప్రయాణికులు ట్రావెల్ చేస్తున్నారు. మొత్తం మూడు కారిడార్లలో 57 స్టేషన్లు, 69 కిలోమీటర్ల మేర మెట్రో సేవలందిస్తోంది. ప్రస్తుతం సూపర్ సేవర్ ఆఫర్-59కు మెట్రోలో ఎంతో ఆదరణ ఉంది. ఈ సూపర్ సేవర్ ఆఫర్ ద్వారా 1.3 మిలియన్స్ ప్రయాణికులు ట్రావెల్ చేస్తున్నారు. ఈ ఆఫర్ మార్చి 31తో ముగిస్తుందని మెట్రో అధికారులు తెలిపారు. కాంటాక్ట్ లెస్ స్మార్ట్ కార్డులపై 10 శాతం డిస్కౌంట్‌తో పాటుగా ఈ సూపర్ సేవర్ ఆఫర్‌ను తిరిగి ప్రవేశపెడుతున్నట్లు మెట్రో అధికారులు తెలిపారు. అయితే వీటి ధరలు పెంచుతున్నట్లు స్పష్టం చేసింది. సూపర్ సేవర్ ఆఫర్-59 స్థానంలో 99 ఆఫర్ ను తీసుకొస్తున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 1, 2023 నుంచి మార్చి 31, 2024 వరకు ఈ ఆఫర్ అమల్లో ఉంటుందని తెలిపింది. ఈ సూపర్ సేవర్ ఆఫర్-99 పై ప్రయాణికులు 100 నోటిఫైడ్ హాలీడేస్ లో కేవలం రూ.99తో అన్‌లిమిటెడ్ ప్రయాణం చేయవచ్చు. సూపర్ సేవర్ ఆఫర్-59 స్మార్ట్ కార్డ్స్ ద్వారా కూడా ఈ ఎస్ఎస్ఓ-99 కొత్త ఆఫర్‌ను తీసుకోవచ్చని తెలిపింది. కొత్త సూపర్ సేవర్ ఆఫర్-99 ద్వారా 100 నోటిఫైడ్ హాలీడేస్ వివరాలు మెట్రో స్టేషన్లతో పాటు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచింది. రోజు రోజుకు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రజారవాణా వ్యవస్థ పటిష్టంగా ఉన్నప్పుడే అభివృద్ధి కొనసాగుతోంది. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వ భాగస్వామ్యంలో ప్రారంభమై విజయవంతంగా కొనసాగుతున్న హైదరాబాద్ మెట్రో ప్రపంచంలోనే అతిపెద్ద పీపీపీ ప్రాజెక్టు అని తెలిసిందే. ఫేజ్ 1 లో భాగంగా మొత్తం 69 కిలోమీటర్ల మెట్రో లైన్ ఉంది. ఫేజ్ 2లో భాగంగా శంషాబాద్ ఎయిర్ పోర్ట్ వరకు 31 కిలోమీటర్ల మేర మెట్రో లైన్ విస్తరించనున్నారు. నాగోల్ - రాయదుర్గం కారిడార్ 3కి కొనసాగింపుగా ఎయిర్ పోర్ట్ వరకు ఫేజ్ 2 మెట్రో రూట్ మ్యాప్ పనులు జరుగుతున్నాయి. విమానాశ్రయం వరకు కనెక్ట్ చేయనున్న హైదరాబాద్ మెట్రో లైన్ కోసం రూ.6250 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం మరో మూడేళ్లలో ప్రాజెక్ట్ పూర్తి చేయాలని భావిస్తోంది.

# ఒంటిపూట బడులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి

**బద్వేలు**

ఎండల తీవ్రత పెరిగిన నేపథ్యంలో పాఠశాలలకు ఒంటిపూట బడులను ప్రకటించాలని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య డివైఎఫ్ఐ కడప జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ...... అకాడమిక్ క్యాలెండర్ లో మార్చి రెండో వారం నుండి ఒంటిపూట బడులు నిర్వహించాలని నిబంధన ఉన్న, రాష్ట్ర ప్రభుత్వం ఆ నిబంధనలను తుంగలోకి తొక్కి కేవలం ఉపాధ్యాయులపై కక్షతో ఒంటిపూట బడులను ప్రకటించకుండా విద్యార్థినీ, విద్యార్థులను తీవ్ర




ఇబ్బందులకు గురిచేస్తుంది. మార్చి మొదటి వారం నుండే ఎండల తీవ్రత పెరిగిన పరిస్థితి. దీని ద్వారా విద్యార్థులకు వడదెబ్బ కొట్టే ప్రమాదం ఉందని వారు వాపోయారు. ఏ ఒక్క విద్యార్థి వడదెబ్బతో మరణిస్తే దానికి పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి తీవ్రతరమైన ఎండలను దృష్టిలో పెట్టుకొని వెంటనే ఒంటిపూట బడులను ప్రకటించాలని లేకుంటే వడదెబ్బకు విద్యార్థులు గురి అయ్యి ప్రాణ నష్టం జరిగితే దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలని లేకపోతే రాష్ట్ర ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకుంటుందని వారు తెలిపారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులు జీవి రమణారెడ్డి ,మల్లికార్జున పాల్గొన్నారు.

## చిలుకూరు బాలాజీ బ్రహ్మోత్సవాలు

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా మొయినబాద్ మండలం చిలుకూరు బాలాజీ స్వామి వారి బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. అంగరంగ వైభోగంగా జరగనున్నల ఈ బ్రహ్మోత్సవాలో భాగంగా మొదటి రోజు ధ్వజారోహణం జరిగింది. ధ్వజారోహణము నాడు పూజ చేసి అక్కడ సమర్పించిన స్వామి వారి ప్రసాదాన్ని పిల్లలు కానీ వారికి అందించడం జరుగుతుంది. ఇది అనాది కాలంగా వాస్తున్న సంప్రదాయం.

## ఛలో పార్లమెంట్ ను విజయవంతం చేయాలి

**మదనపల్లె**

బిజెపి కేంద్ర ప్రభుత్వం చేపట్టిన రైతు వ్యతిరేక విధానాలు, నల్లచట్టాలను వ్యతిరికేస్తూ సిఐటియు ఏప్రిల్ 5న చేపట్టిన ఛలో పార్లమెంటు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. నేడు మదనపల్లె పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు వద్దనున్న ఆటో స్టాండ్ వద్ద కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్ రెడ్డి, హరింద్రనాథ్ శర్మ, రెడ్డి ప్రసాద్, వెంకటేష్, అశోక్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

## ఆసరా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**గూడూరు**

గూడూరు పట్టణంలోని షాదీ మంజీల్ లో వైయస్సార్ ఆసరా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే వరప్రసాద్ జ్యోతి ప్రజ్వాలన చేశారు ఎమ్మెల్యే పొదుపు సంఘాల మహిళలు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు చెక్కులు అందజేశారు ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ మాట్లాడుతూ పాదయాత్రలో ప్రజలు పడుతున్న ఇబ్బందులను తెలుసుకొని ఎన్నికల మేనిఫెస్టోలో జగన్మోహన్ రెడ్డి అనేక హామీలు ఇచ్చారని ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైన ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తున్నారని గుర్తు చేశారు 2014 నుండి 2019 సంవత్సరం వరకు తెలుగుదేశం ప్రభుత్వంలో ఏ ఒక్క హామీ నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని అందువల్ల ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వెల్లడించారు మరలా ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డిని చేసుకోకపోతే ఇప్పుడు వస్తున్నటువంటి సంక్షేమ పథకాలన్నీ నిలిచిపోతాయని తెలిపారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ ,నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి ,బొమ్మిడి శ్రీనివాసులు ,బత్తిని విజయ్ కుమార్ ,తాళ్లూరు శ్రీనివాసులు ,మురళి ,పొదుపు సంఘాల మహిళలు పాల్గొన్నారు

## పోలీసులకు ఆశ్రయించిన ప్రేమ జంట

**చిత్తూరు**

ప్రేమ వివాహం చేసుకున్నామని అయితే మా కుటుంబ సభ్యుల నుండి హాని ఉంది రక్షణ కల్పించాలని చిల్లకూరు పోలీసులను దిశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో యువజంట ఆశ్రయించింది . చిత్తూరు జిల్లా పీలేరు పట్టణానికి చెందిన గేయ శ్రీ చిల్లకూరు గ్రామానికి చెందిన మనోజ్ కుమార్ ఫేస్ బుక్ ద్వారా పరిచయం ఏర్పడి ప్రేమగా మారింది మేజర్లైన వీరు ఫిబ్రవరి నెలలో పెద్దలకు తెలియకుండా వివాహం చేసుకున్నారు అనంతరం పోలీసులను ఆశ్రయించగా వారి పెద్దలను పిలిపించి మాట్లాడారు అమ్మాయి తల్లిదండ్రులు రెండు నెలల్లో పంపిస్తామని చెప్పి తీసుకువెళ్లి అక్కడ వేరే వారితో వివాహం చేసేందుకు ప్రయత్నిస్తుండడంతో గేయశ్రీ ఇంటి నుండి వచ్చేసి దిశా ఫౌండేషన్ ఆశ్రయించి వివాహం చేసుకున్నారు ఫౌండేషన్ చైర్మన్ అరుణ యువజంటను చిల్లకూరు పోలీస్ స్టేషన్కు తీసుకువచ్చి మేజర్లైన వీరికి కుటుంబం నుంచి ఎటువంటి ఇబ్బందులు ఎదుర కాకుండా రక్షణ కల్పించాలని కోరారు .

## కన్నాతో గంటా, ప్రత్తిపాటి భేటీ

**గుంటూరు**

గుంటూరు పట్టణంలో మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ను మాజీ మం త్రులు గంటా శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు శనివారం మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా వారు ప్రస్తుత రాజకీయ పరిస్థితుల పై చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివ రించి వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో వీరి భేటి రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఈ నెల 6 న ఫ్యామిలీ డాక్టర్ వైద్యవిధానం

**విజయవాడ**

ఈ నెల 6 లో తేదీన ఫ్యామిలీ డాక్టర్ వైద్యవిధానం ప్రారంభంఅవుతుందని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిలకలూరిపేట నియోజకవర్గం లో అధికారికంగా ప్రారంభించనున్నారు. చిలకలూరిపేట రూరల్ మండలం లింగంగుంట్లలో ఏర్పాట్లను మంత్రి పరిశీలించారు. కార్యక్రమంలో మంత్రితో పాటు ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్ రెడ్డి తదితరులు వున్నారు.

# సింహపురిలో ఆల్ ఇన్ వన్ మసాజ్

**నెల్లూరు:**

ల్లూరులో బ్యూటీ సెలూన్, స్పాల పేరుతో కొంతమంది అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నట్టు పోలీసులు గుర్తించారు. కొన్నాళ్లుగా ఆయా స్పా సెంటర్లపై నిఘా పెట్టారు. చివరకు రెడ్ హ్యాండెడ్ గా అక్కడ నిర్వాహకుల్ని పట్టుకున్నారు. మొత్తం 15మందిని అదుపులోకి తీసుకున్నారు. అందులో 8 మందిని బాధితులుగా గుర్తించి వారిని సేఫ్టీ హోమ్స్ కి తరలించినట్టు తెలిపారు నెల్లూరు పోలీసులు. నెల్లూరు దర్గామిట్టలోని రోజ్ కింగ్ స్పా, లోటస్ స్పా కి సంబంధించిన మొత్తం 3 బ్రాంచ్ లపై దాడులు చేశారు పోలీసులు. దాడుల వ్యవహారం మీడియాకి తెలియకుండా జాగ్రత్తపడ్డారు. అరెస్ట్ అయిన తర్వాత మాత్రం ప్రెస్ మీట్ పెట్టి వివరాలు తెలియజేశారు. మూడు స్పా లపై ఏకకాలంలో దాడులు చేశారు. స్పా ముసుగులో లోపల జరుగుతున్న వ్యవహారాలు బయటపడ్డాయి. పైకి స్పా, మసాజ్ సెంటర్ అనే పేరు ఉంటుంది. లోపలికి వెళ్లిన తర్వాత ఆర్డినరీ సర్వీసా, స్పెషల్ సర్వీసా అనే ప్రశ్న వినపడుతుంది. స్పెషల్ సర్వీస్ కి వెళ్తే అందులో ఎక్స్ ట్రా సర్వీస్ అనే పేరుతో నిర్వాహకులు అమ్మాయిలతో అసభ్య కార్యకలాపాలు చేపడుతున్నారని తెలిపారు పోలీసులు. అయితే ఈ సర్వీసులు కేవలం ఆయా స్పా ల వ్యవహారం తెలిసినవారికి మాత్రమే అందుబాటులో ఉంటాయ. అంటే వారంతా అక్కడికి రెగ్యులర్ కస్టమర్లు. కొత్తగా వచ్చేవారికి, అనుమానంగా ఉన్నవారికి ఎలాంటి ఆఫర్లు ఇవ్వరు. అక్కడ నార్మల్ స్పా లలో జరిగే మసాజ్ లు మాత్రమే చేసి పంపిస్తారు.మొత్తం 8మంది అమ్మాయిలను పోలీసులు అదుపులోకి తీసుకుని సేఫ్టీ హోమ్స్ కి తరలించారు. పశ్చిమబెంగాల్, ఢిల్లీ, ముంబై నుంచి వీరిని తీసుకొస్తున్నారు. నెల్లూరు నగరంలో వారికి అనుకూలంగా ఉన్న ప్రాంతాల్లోనే బస ఏర్పాట్లు చేస్తున్నారు. స్పా లలో వ్యభిచారం కోసం తీసుకొచ్చే అమ్మాయిల పూర్తి బాధ్యత నిర్వాహకులదే. వారికి జీతాలతోపాటు, రూమ్ రెంట్, ఇతరత్రా అవసరాలన్నీ వారే చూసుకుంటారు. వారు స్పా లో మినహా ఇంకెక్కడా పనిచేయకూడదు, బయటకు వెళ్లకూడదనే రూల్స్ కూడా పెడతారట. నెల్లూరులో మూడు స్పా సెంటర్లపై దాడులు చేశామని, ఇకపై కూడా దాడులు కొనసాగుతాయని హెచ్చరించారు పోలీసులు. స్పా ముసుగులో అసాంఘిక కార్యక్రమాలకు ఎవరు పాల్పడినా క్షమించేది లేదన్నారు. నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని, విటులపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బెజవాడలోని ఓ స్పా సెంటర్ పై కొన్ని రోజుల కిందట పోలీసులు దాడులు నిర్వహించారు. స్పా పేరుతో వ్యభిచారం చేయిస్తున్న ఇద్దరు నిర్వాహకులను, 8 మంది బాధిత మహిళలు, యువతులను, ముగ్గురు అబ్బాయిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బెజవాడ కేంద్రంగా హైటెక్ వ్యభిచారం కొనసాగిస్తున్నారు. విజయవాడ నగరంలో పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో గురునానక్ కాలనీలో ఉన్న కె స్టూడియో స్పాలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులే మారువేషంలో అమ్మాయిల కోసం వెళ్లి బేరసారాలు జరిపారు. అందులోనూ పక్కా సమాచారం అందటంతో ప్రత్యేక పోలీసు బలగాలు స్పాలో సోదాలు చేయటంతో 8 మంది అమ్మాయిలలను రక్షించారు పోలీసులు. అమ్మాయిల కోసం స్పా సెంటర్కు వచ్చిన ముగ్గురు యువకులు, ఇద్దరు నిర్వాహకులను పోలీసుల అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు విడిపించిన మహిళలు అంతా పలు రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తించారు

# కదలనున్న పేపర్ లీక్స్ లింక్స్

**హైదరాబాద్:**

టీఎస్పీఎస్సీ పేపర్ లీక్స్ వ్యవహారంలో సిట్ దర్యాప్తు కొనసాగిస్తోంది. ఇప్పటికే పలువురిని అరెస్ట్ చేయగా... మరికొందరిని విచారిస్తోంది. తవ్వేకొద్దీ అక్రమాలు బయటికి వస్తూనే ఉన్నాయి. అయితే తాజాగా తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యదర్శి అనితా రామచంద్రన్ తో పాటు మెంబర్ లింగారెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. వీరి నుంచి పలు వివరాలను సేకరించే ఆలోచనలో ఉంది సిట్. ఈ లీకేజీ కేసులో కార్యదర్శి పీఏ ప్రవీణ్కుమార్, సిస్టమ్ అడ్మిన్ రాజశేఖర్రెడ్డి ప్రధాన నిందితులుగా ఉన్నారు. ఈ ఇద్దరిని విచారించడంతో మాజీ ఉద్యోగి ప్రవీణ్, అందులో పనిచేసే రమేష్, షమీమ్లు కూడా బయటికి వచ్చారు. కమిషన్ సభ్యుడు బండి లింగారెడ్డికి పీఏగా రమేశ్ పని చేశారు. ఫలితంగా కార్యదర్శితో పాటు కమిషన్ సభ్యుడికి నోటీసులు జారీ చేసింది సిట్. వీరిద్దర్నీ విచారించి వాంగ్మూలం నమోదు చేయాలని భావిస్తోంది. ఇదే సమయంలో కమిషన్ ఛైర్మన్ తో పాటు ఇతర సభ్యులకు కూడా నోటీసులు జారీ చేసి విచారించాలని సిట్ భావిస్తోంది. కమిషన్ లో ఉద్యోగాలు విధులు, విధివిధానాలు, నిర్వర్తించే బాధ్యతల కూడా ఆరా తీసే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇదిలా ఉంటే... తెలంగాణ కాంగ్రెస్ మరో అడుగు ముందుకేసింది. ఈ వ్యవహారంపై విచారణ చేయాల్సిందిగా ఈడీకి గురువారం ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి నేతలతో కలిసి ఫిర్యాదును ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన రేవంత్ రెడ్డి.... టీఎస్పీఎస్సీ దొంగలకు, దోపీడీదారులకు, అవినీతిపరులకు అడ్డాగా మారిందని ఆరోపించారు. పరీక్షల నిర్వహణలోఆశ్రిత పక్షపాతంతో వ్యవహరిస్తున్నారని... లక్షలాది మంది ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని మండిపడ్డారు. వందలాది మంది నిరుద్యోగులు ప్రాణాలు కోల్పోయినా కల్వకుంట్ల కుటుంబానికి చీమ కుట్టినట్లు కూడా లేదని దుయ్యబట్టారు. కేసుతో లింక్ ఉన్న ప్రభుత్వ పెద్దలను అమరవీరుల స్థూపం ముందు ఉరేసినా తప్పులేదని వ్యాఖ్యానించారు. ఇంత జరిగినా నిరుద్యోగులకు కేటీఆర్ క్షమాపణ చెప్పి పారదర్శక విచారణ చేయిస్తార నుకున్నామని. కానీ సిట్ తో కేసులు వేయించి విద్యార్థి నాయకులను నిర్బంధించడం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేపర్ లీకేజ్ లో శంకరలక్ష్మి దగ్గర నుంచి నేరం మొదలైందని ఆరోపించారు రేవంత్ రెడ్డి. ఏ1 గా శంకర లక్ష్మిని, ఏ2గా చైర్మన్, సెక్రెటరీలను పెట్టాలని డిమాండ్ చేశారు. కేసులో కావాల్సిన వారిని కాపాడి చిన్న ఉద్యోగులను బలిచేసే ప్రయత్నం చేస్తున్నారని... ఈ అంశంపై మేం ఇప్పటికే కోర్టును ఆశ్రయించామని చెప్పారు. కోర్టులో కేసు విచారణ జరుగుతోందన్నారు. అయితే ఈ వ్యవహారంపై పూర్తి స్థాయిలో పారదర్శకంగా విచారణ జరిపించేలా... ఈడీ జాయింట్ డైరెక్టర్ ను కలిసి పిర్యాదు చేశామని తెలిపారు. 420, 120బీ సెక్షన్లు ఈడీ పరిధిలోకి వస్తాయన్న రేవంత్ రెడ్డి.... కేటీఆర్ తో సహా టీఎస్పీఎస్సీ అధికారులందరినీ విచారించాలని కోరినట్లు పేర్కొన్నారు.

# కాంగ్రెస్ సీనియర్ల తాపత్రయం ఏమిటో...

### గులాబీతో పొత్తు అంటూ ప్రకటనలు

**హైదరాబాద్ :**

భారత రాష్ట్ర సమితి తెలంగాణ రాజకీయాల్లో అధికార పార్టీ. ఆ పార్టీతో పోటీ పడి.. ఓడించి అధికారం చేపట్టాలని కాంగ్రెస్, బీజేపీ ప్రయత్నిస్తున్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం మళ్లీ వద్దని ప్రజలు అనుకుంటే ..ఈ రెండింటిలో ఏ పార్టీ ప్రత్యామ్నాయంగా నిలుస్తుందని ప్రజలు భావిస్తే..... ఆ పార్టీకి ఓట్లేస్తారు. అంటే ఇక్కడ ప్రధానంగా కావాల్సింది బీఆర్ఎస్ ప్రత్యర్థి హోదా. ప్రత్యామ్నాయం కేటగిరి. ఇలాంటి పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్లు ఏం చేస్తున్నారు ? బీఆర్ఎస్తో పొత్తులంటూ ప్రకటనలు చేస్తున్నారు. దీని వల్ల ఎవరికి లాభం ? బీఆర్ఎస్కా ? కాంగ్రెస్ పార్టీకా ?కొద్ది రోజుల కిందట కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఢిల్లీలో బీఆర్ఎస్తో పొత్తుల గురించి మాట్లాడారు. ఎంత రచ్చ కావాలో అంతా అయింది. ఆ తర్వాత తీరిగ్గా తన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారని లైట్ తీ?కున్నారు. కానీ ప్రజల్లో మాత్రం చర్చ ప్రారంభమయింది. తాజాగా సీనియర్ నేత జానారెడ్డి కూడా అదే మాట్లాడారు. రాహుల్ గాంధీ ఇష్యూలో బీఆర్ఎస్ మద్దతు పలికిందని ఆ పార్టీతో పొత్తులు పెట్టుకునే అవకాశం ఉందని తేల్చారు. ఆయన మాటలు మరోసారి కలకలం రేపాయి. సాయంత్రానికి తాను ఆ మాటలు మాట్లాడలేదని కవర్ చేసుకున్నారు. కానీ జరగాల్సిన నష్టం మాత్రం జరిగిపోయింది. అయితే సీనియర్ నేతలు ఉద్దేశపూర్వకంగానే ఈ వ్యాఖ్యలు చేస్తున్నారు. బీఆర్ఎస్తో పొత్తు విషయాన్ని ముందుకు తీసుకెల్లాలని అనుకుంటున్నారన్న అభిప్రాయం ఆ పార్టీలోనే వినిపిస్తోంది. మరో వైపు టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి చావో రేవో అన్నంతగా పోరాటం చేస్తున్నారు. టీఎస్పీఎస్సీ పేపర్ లీకేజీ కేసులో ఆయన ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకు పడుతున్నారు. కేటీఆర్ ను కార్నర్ చేస్తున్నారు. రాహుల్ అనర్హతా అంశంలో కేటీఆర్ .. పాజిటివ్ వ్యాఖ్యలు చేసినా వదిలి పెట్టలేదు.బీఆర్ఎస్పై ఏ మాత్రం సాఫ్ట్ కార్నర్ చూపించినా మొదటికే మోసం వస్తుందని.. రెండు పార్టీలు ఒకటే అనే అభిప్రాయం ప్రజల్లో బలపడితే కాంగ్రెస్ తీవ్రంగా నష్టపోతుందని రేవంత్ రెడ్డికి తెలుసు. అందుకే జాతీయ స్థాయి రాజకీయాల గురించి పట్టించుకోకుండా పోరాటం ఉద్ధృతం చేస్తున్నారు. పాదయాత్రను కొనసాగించబోతున్నారు. ఇ?లాంటి పరిస్థితుల్లో సీనియర్ల కామెంట్లు ఆయన పోరాటాన్ని బలహీనం చేస్తున్నాయన్న అభిప్రాయాన్ని కొంత మంది వ్యక్తం చేస్తున్నారు. పొత్తులపై మాట్లాడకుండా హైకమాండ్ కట్టడి చేయాల్సి ఉందంటున్నారు.ఎలా చూసినా తెలంగాణలో ఎన్నికలకు ముందు పొత్తు పెట్టుకునే అవకాశాలు లేనే లేవు. అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చే ఫలితాలను బట్టి తర్వాత ఎవరు ఏ పార్టీతో కలుస్తారు అసలు కలుస్తారా లేదా అన్నది తేలుతుంది. హంగ్ లాంటి పరిస్థితి వస్తే కాంగ్రెస్, బీజేపీ ఎట్టి పరిస్థితుల్లోనూ కలవవు కాబట్టి బీఆర్ఎస్ ఎవరితో కలవాలనుకుంటే వారితో కలుస్తుంది. బీజేపీపై ఇప్పుడు బీఆర్ఎస్ తీవ్రంగా పోరాడుతూ ఉండవచ్చు.. కానీ రాజకీయాల్లో శాశ్వత మిత్రులు.. శాశ్వత శత్రువులు ఉండరు. అందుకే ఎన్నికల తర్వాత ఏం జరుగుతుందో అంచనా వేయడం కష్టం. వచ్చే ఫలితాలను బట్టి పరస్పర రాజకీయ ప్రయోజనాలను బట్టి పార్టీలు నిర్ణయం తీసుకుంటాయి. కానీ కానీ కాంగ్రెస్ పార్టీ సీనియర్లు మాత్రం ముందే తొందరపడి ప్రకటనలు చేస్తున్నారు

## వైకాపా, టీడీపీ బాహాబాహీ

**పుట్టపర్తి**

పుట్టపర్తి కేంద్రంలో శనివారం ఉద్రిక్తత నెలకొంది. స్థానిక ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి వర్గం, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి వర్గం మధ్య ఘర్షణ చెలరేగింది. ఇరువర్గాలు టెంకాయలు, చెప్పులు విసురుకున్నారు. ఘటనలో రఘునాథ్ రెడ్డి కార్ల అద్దాలు ధ్వంసం అయ్యాయి. కొద్ది రోజుల క్రిందట పల్లె రఘునాథ్ రెడ్డి పై ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి సవాల్ విసిరిన సంగతి అందరికీ తెలిసిందే. ఆ సవాల్ ని స్వీకరిస్తూ పల్లె రఘునాథ్ రెడ్డి తన వర్గీయులతో సత్యమ్మ గుడి వద్దకు చేరుకున్నారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి సత్యమ్మ గుడి లోపలికి వెళ్లి అమ్మవారిని దర్శనం చేసుకుని బయటకు వచ్చిన వెంటనే ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. టీడీపీ శ్రేణులు రోడ్డుపై బైఠాయించారు. ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశా రు. ఇరు వర్గాలను చెదరగొట్టేందుకు లాఠీచార్జ్ చేశారు. దీంతో పోలీసుల్ని భారీగా మోహరించారు.

## ప్రజల్లో విశ్వాసం కోల్పోతున్న వైకాపా

**మచిలీపట్నం**

వైయస్సార్ పార్టీ మీద ప్రజలకు విశ్వాసం కోల్పోతుంది. అందుకే ముందస్తు ఎన్నికలకు సీఎం జగన్ సిద్ధమవుతున్నాడని - మాజీ ఎంపి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణ అన్నారు.

శనివారం అయన మీడియాతో మట్లాడారు. కొనకళ్ల మాట్లాడుతూ అధికారంలో ఉన్న వైయస్సార్ పార్టీ ప్రజల విశ్వాసం కోల్పోయింది. , రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువైంది. తో యువత పెడదారి పడుతున్నారని అన్నారు. గంజాయికు విచ్చలవిడిగా అలవాటు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల నుండి వ్యతిరేకత రావడం, ఆర్థిక సంక్షోభంతో జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ప్రభుత్వం కూరుకుపోయింది. తీవ్ర వ్యతిరేకత పెరిగిపోక ముందే ఎన్నికలకు వెళ్లాలని జగన్మోహన్ రెడ్డి ఉద్దేశమని అన్నారు. అందుకే ముందస్తు ఎన్నికలకు సిద్ధమవుతున్నారని కొనకళ్ళ అన్నారు. దీనికి మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎలక్షన్లో ఉదాహరణని, ఎన్నికలు ఎప్పుడు జరిగిన తెలుగు దేశం పార్టీసిద్ధమని స్పష్టం చేశారు.

## కరుగొండ గ్రామంలో దాహం దాహం

**అల్లూరి**

అల్లూరి సీతారామరాజు జిల్లా కరుగొండ గ్రామంలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. వేసవి రాకముందే అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ఆదివాసి పల్లెలో నీటి ఎద్దడి నెలకొంది.మారుమూల గ్రామాల్లో దాహార్తిని తీర్చుకోవడం కోసం కోసుల దూరంలో ఉన్న నీటి వనరులను ఆశ్రయించాల్సి వస్తోంది. అల్లూరి జిల్లాలో మారుమూల గ్రామాల గిరిజనులు.పెదబయలు మండలంలోని గోమాంగి పంచాయతీ పరిధి కరుగొండ గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్య పరిష్కరించాలని గ్రామ వాలంటరీ హిమబింధు ఆ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఆమె మాట్లాడుతూ.. ఎన్నిసార్లు అధికారులకు నాయకులకు చెప్పిన తమ గ్రామంలో నెలకొన్న త్రాగునీటి సమస్య పరిష్కారం కావడం లేదని ఆవేదన చెందుతున్నారు.ఈ సమస్యపై అధికారులు పరిష్కరించాలని డిమాండ్ చేస్తున్నారు.అలాగే తమ గ్రామంలో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కరిస్తేనే 2024లో నాయకులకు తమ గ్రామంలో ఉన్న 500 ఓట్లు వేసి గెలిపిస్తామని హెచ్చరిస్తున్నారు.మంచినీటి సమస్య పరిష్కరించని నేపథ్యంలో శుక్రవారం పాడేరులో జరిగే స్పందనలో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

## జనంలోకి జనసేన కార్యక్రమం

**నరసాపురం**

పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణం ఒకటో వార్డులో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ బొమ్మిడి నాయకర్ జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఒకటో వార్డులోని ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కరించడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని బొమ్మిడి నాయకర్ అన్నారు.నరసాపురం నియోజకవర్గంలో ఈ గ్రామానికి వెళ్లిన త్రాగునీటి సమస్య అలానే ఉన్నదని, నియోజకవర్గంలో ఆక్వా యూనివర్సిటీ నిర్మాణం బియ్యపుతిప్ప ఫిషింగ్ హార్బర్ నిర్మాణం వశిష్ట గోదావరి నదిపై బ్రిడ్జి నిర్మాణం అంతా ఒక బూటకం అని అన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నరసాపురం నియోజకవర్గంలో ఎటువంటి అభివృద్ధి కార్యక్రమాలు చేయలేదని ఆయన విమర్శించారు. రానున్న 2024 ఎన్నికల్లో జనసేన పార్టీకి ఒక్క అవకాశం కల్పించాలని ఆయన ప్రజలను కోరారు.ఈ కార్యక్రమం లో జనసేన నాయకులు కోటిపల్లి వెంకటేశ్వరరావు మరియు జనసైనికులు.వీరమహిళలు పాల్గొన్నారు.

## అంతరాష్ట్ర ఎర్రచందన స్మగ్లర్ అరెస్ట్

**తిరుపతి**

తిరుపతి జిల్లా వెస్ట్ సబ్ డివిజన్ బాకరాపేట సర్కిల్ ఎర్రావారిపాల్యం పరిధిలో కోటి రూపాయలు విలువగల ఎర్ర చందనం దుంగలను మరియు రెండు కార్లు, రెండు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. ఈ కేసు వివరాలను శనివారం ఎస్పీ కార్యాలయం నందు ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వివరాలను జిల్లా ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి, తెలియజేసారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

# టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసుపై ఈడీ దృష్టి

**హైదరాబాద్:**

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో సిట్ దర్యాప్తు కొనసాగుతుండగానే ఈడీదృష్టి సారిస్తోందని తెలుస్తోంది. మనీ లాండరింగ్ కేసు నమోదు చేసే యోచనలో ఈడీ అధికారులున్నారు. ఈసిఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేసే యోచనలో ఉన్నారు. బేగంబజార్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఈడీ అధికారులు కేసు నమోదు చేయనున్నారు. ప్రశ్నాపత్రాల విక్రయం ద్వారా నగదు లక్షల్లో చేతులు మారినట్లు గుర్తించారు. ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డి, డాక్యతోపాటు ఇతర నిందితులు లక్షల్లో డబ్బులు తీసుకున్నట్లు ఈడీ అనుమానిస్తోంది. ఏ ఈ ప్రశ్న పత్రం కోసం 25 లక్షల రూపాయలు చేతులు మారినట్లు సిట్ ఇప్పటికే తేల్చింది. హవాలా మార్గంలో నగదు చేతులు మారినట్లు ఈడీ అధికారులు అనుమానిస్తున్నారు. పీఎంఎల్ఏ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని ఈడీ అధికారులు నిర్ణయించినట్లు సమాచారం.మరోవైపు టీఎస్‌పీఎస్సీ సభ్యుడు లింగారెడ్డికి సిట్ నోటీసులు జారీ చేసింది. చైర్మన్, సెక్రటరీలను సైతం విచారించాలని సిట్ నిర్ణయించింది. ఇవాళ కూడా శమీమ్, రమేష్, సురేష్‌లను అధికారులు సుదీర్ఘంగా విచారించారు.మరోవైపు టీఎస్‌పీఎస్సీప్రశ్నాపత్రాల లీకేజీ కేసులో టీఎస్‌పీఎస్సీ కాన్ఫిడెన్షియల్ సెక్షన్ అధికారిణి శంకరలక్ష్మిని సిట్ అధికారులు మరోసారి . ఇప్పటికే రెండుసార్లు కార్యాలయానికి పిలిచి శంకరలక్ష్మి నుంచి వివరాలు సేకరించిన అధికారులు షమీమ్, రమేష్ చెప్పిన వివరాలను నిర్ధారించుకోవడానికి మరోసారి ఆమెను ప్రశ్నించారు.. శంకరలక్ష్మి తన డైరీలో రాసుకున్న లాగిన్ పాస్ వర్డ్‌ను ప్రవీణ్, రాజశేఖర్ దొంగిలించి కంప్యూటర్ లోకి లాగిన్ అయ్యారని, కంప్యూటర్‌లో ఉన్న పేపర్‌లను పెన్ డ్రైవ్‌లో కాపీ చేసుకున్నారని ఇప్పటిదాకా నిర్ధారించారు. గ్రూప్ 1 ప్రిలిమ్స్ పేపర్‌ను ప్రవీణ్ షమీమ్, రమేష్‌కు ఇవ్వగా, రాజశేఖర్ రెడ్డి సురేష్, ప్రశాంత్ రెడ్డికి ప్రశ్నాపత్రాన్ని ఇచ్చాడని అధికారులు గుర్తించారు. తమకు ప్రశ్నాపత్రాలు ఇవ్వాలని ప్రవీణ్, రాజశేఖర్ రెడ్డిని షమీమ్, రమేష్ అడిగినట్లు సిట్ అధికారులు అనుమానిస్తున్నారు. ఎవరికీ చెప్పకుండా ఉండాలంటే తమకు ప్రశ్నాపత్రం ఇవ్వాలని షమీమ్ అడిగినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు శంకరలక్ష్మి నుంచి అధికారులు మరి కొన్ని వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. టీఎస్‌పీఎస్సీలో షమీమ్, రమేష్‌లు చేసే పని, ఇతర వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు.ఎల్ బీ నగర్ లోని షమీమ్ నివాసంలో సిట్ సోదాలు ముగిశాయి. షమీమ్ ఇంట్లో సిట్ అధికారులు గంట పాటు సోదాలు చేశారు. ప్రశ్నాపత్రం లీకేజీ తరువాత ఇంటి నుంచి ఎవరెవరితో మాట్లాడిందనే వివరాలు సేకరించారు. సురేష్, రమేష్.. షమీమ్ ఇంటికి ఎప్పుడెప్పుడు వచ్చారనే వివరాలు సేకరించారు. షమీమ్ నివాసంలో ప్రశ్నాపత్రాలకు సంబంధించిన కొన్ని కీలక ఆధారాలను సిట్ అధికారులు సేకరించారు.టీఎస్‌పీఎస్సీపేపర్ లీక్ కేసులో ఉద్దేశపూర్వకంగానే టెక్నికల్ సర్వీస్ నుంచి టీఎస్‌పీఎస్సీకి డిప్యుటేషన్‌పై వచ్చిన రాజశేఖర్ రెడ్డి, సిస్టమ్ అడ్మినిస్ట్రేటర్‌గా పనిచేస్తున్న ప్రవీణ్‌మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలానికి చెందిన ఉపాధ్యాయురాలు రేణుకను నిందితులుగా సిట్ అధికారులు ఇప్పటికే నిర్ధారించారు.మరోవైపు టీఎస్‌పీఎస్సీపేపర్ లీక్ కేసులో అనేక అక్రమాలు జరిగాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ కుమార్‌టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ఆరోపిస్తున్నారు. దీనిపై ఐటీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావుపరువు నష్టం దావా 100 కోట్ల రూపాయలకు వేస్తానని హెచ్చరించారు. వారం రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తెలంగాణలో ఈ ఏడాదే అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటంతో టీఎస్‌పీఎస్సీపేపర్ లీక్ కేసు కీలకంగా మారింది. దీనికి తోడు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి స్వయంగా ఈడీ అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. దీంతో ఈడీ అధికారికంగా విచారణ ప్రారంభించే అవకాశముంది. ఈడీ విచారణ ప్రారంభమైతే కేసు మరో మలుపు తిరగనుంది.

# బీఆర్ఎస్, కేజ్రీవాల్‌పై బాంబ్ పేల్చిన సుఖేశ్..

**న్యూఢిల్లీ:**



భారత్ రాష్ట్ర సమితి ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై సుఖేశ్ చంద్రశేఖర్ బాంబు పేల్చాడు. కేజ్రీవాల్ తరపున 2020లో బీఆర్ఎస్ ఆఫీసులో రూ.75 కోట్లు ఇచ్చానని వెల్లడించాడు. ఈ ఆపరేషన్ కోడ్ వర్డ్ 15 కిలోల నెయ్యి అని సుఖేశ్ చంద్రశేఖర్ తెలిపాడు. ఢిల్లీ లిక్కర్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఒక వ్యక్తికే ఈ మొత్తాన్ని అందజేశానన్నాడు. కేజ్రీవాల్‌తో జరిపిన వాట్సాప్, టెలిగ్రాఫ్ చాట్‌లు 700 పేజీలు తన వద్ద ఉన్నాయని చెప్పాడు. సిబిఐఈడీకేసులనుంచి విముక్తి కలిగిస్తానంటూ పలువురి వ్యాపారవేత్తల్ని మోసం చేసిన కేసులో సుఖేశ్ చంద్రశేఖర్ తీహార్ జైల్లో ఉన్నాడు.కేజ్రీవాల్, బీఆర్ఎస్‌పై ఆరోపణలతో కూడిన లేఖను తన లాయర్ అనంత్ మాలిక్ ద్వారా సుఖేశ్ బయట పెట్టాడు. కేజ్రీవాల్ ఆదేశాల మేరకు హైదరాబాద్‌లోని భారత్ రాష్ట్ర సమితి కార్యాలయంలో రూ.75 కోట్లు అందజేసినట్లు లేఖలో వెల్లడించాడు. బీఆర్ఎస్ కార్యాలయం లోపల పార్క్ చేసిన రేంజ్ రోవర్‌లో ఉన్న ‘ ఏపి’ అనే వ్యక్తికి రూ.75 కోట్లు అందించినట్లు లేఖలో పేర్కొన్నాడు. ‘ ఏపీ’ కూర్చున్న రేంజ్ రోవర్ కారు నెంబర్ 6060గా లేఖలో పేర్కొన్నాడు. కేజ్రీవాల్‌ను త్వరలో తీహార్ క్లబ్‌కు ఆహ్వానిస్తానంటూ ఇటీవల కోర్టులో హాజరైనప్పుడు సుఖేశ్ చంద్రశేఖర్ విలేకరులతో చెప్పాడు. సుఖేశ్ చంద్రశేఖర్ లేఖ రాజధాని ఢిల్లీతో పాటు తెలంగాణలో సంచలనం రేపుతోంది.రూ.200 కోట్ల హవాలా కేసులో సుఖేశ్ చంద్రశేఖర్ నిందితుడు. వందల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడి జైలు ఊసలు లెక్కిస్తున్నాడు. జైలు బయట ఎంత విలాసవంతంగా బతికాడో.. జైల్లో కూడా అదే అనుసరించాడు. అకస్మాత్తుగా అతడి జైలు గదిని తనిఖీ చేసిన అధికారులు అక్కడ దొరికిన ఖరీదైన వస్తువులను చూసి విస్మయానికి గురయ్యారు. ఎందుకంటే అతడు వాడే బ్రాండెడ్ గుస్సీ చెప్పుల విలువ రూ.లక్షన్నర కాగా, అతడి 3 జీన్స్ ప్యాంట్ల విలువ రూ.80 వేలు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ

**నిజామాబాద్**



మారిన ప్రస్తుత సామాజిక పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా జడ్జి సునీత కుంచాల హితవు పలికారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా కోర్టు నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా పులాంగ్ చౌరస్తా వరకు కొనసాగి, తిరిగి అదే మార్గంలో కోర్టు కాంప్లెక్స్ వద్దకు చేరుకుంది. జిల్లా సెషన్స్ జడ్జితో పాటు అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్, ఇతర న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, వివిధ సంఘాల ప్రతినిధులు, విద్యార్థిని విద్యార్థులు, యువకులు సైకిల్ ర్యాలీలో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ జడ్జి సునీత కుంచాల మాట్లాడుతూ, నేటి రోజుల్లో అనేక మంది వ్యాయామానికి దూరంగా ఉంటున్నారని అన్నారు. సరైన పోషకాహారాన్ని తీసుకోకుండా జంక్ ఫుడ్ వైపు మొగ్గు చూపుతున్నారని, నడకను తగ్గించేశారని తెలిపారు. ఈ పరిణామాలు ఆరోగ్యాలపై దుష్ప్రభావం చూపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మన నిత్య జీవితంలో తారసపడే వారిలో అనేకమంది ఏదో ఒక అనారోగ్య సమస్యతో సతమతం అవుతున్నారని అన్నారు. ఇదివరకు ఎక్కడికి వెళ్లాలన్న సైకిల్ విరివిగా వాడేవారని, ఆరోగ్య సాధనకు ఇది ఎంతగానో దోహదపడేదని జిల్లా జడ్జి గుర్తు చేశారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఆరోగ్య పరిరక్షణ ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందన్నారు. అదనపు కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ పని ఒత్తిడికి లోను కావాల్సి వస్తోందన్నారు. దీనికి తోడు మారిన ఆహారపు అలవాట్లు అనారోగ్యాల బారిన పడేలా చేస్తున్నాయని అభిప్రాయపడ్డారు. ఇటీవల కాలంలో వయసుతో సంబంధం లేకుండా అనేకమంది గుండెపోటుకు గురై అకస్మాత్తుగా ప్రాణాలు కోల్పోతున్న సంఘటనలు ఆందోళనకరంగా పరిణమించాయని అన్నారు. ఆరోగ్యకర జీవనాల కోసం ప్రతి ఒక్కరు క్రమబద్ధమైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. ఆరోగ్యాల పట్ల తగిన జాగ్రత్తలు పాటిస్తూ, యోగా, నడక, వ్యాయామాలకు తప్పనిసరిగా సమయం కేటాయించాలని హితవు పలికారు. ఆరోగ్య పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థతో కలిసి జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ సైకిల్ ర్యాలీ నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఈ ర్యాలీలో అదనపు జిల్లా జడ్జి శ్రీనివాసరావు, సీనియర్ సివిల్ జడ్జిలు పద్మావతి, శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు భవ్య, సౌందర్య, గిరిజ, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యుడు రాజేందర్ రెడ్డి, సైక్లింగ్ అసోసియేషన్ ప్రతినిధి విజయ్ కుమార్, రోటరీ క్లబ్ ప్రతినిధి సతీష్ షా, సీనియర్ న్యాయవాదులు రాజ్ కుమార్ సుబేదార్, ఆశ నారాయణ, భాస్కర్, కోర్ట్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేటు డ్రైవర్లు ఓనర్ల సమస్యలు పరిష్కరించాలి.

**కరీంనగర్**



ప్రైవేట్ రవాణా వ్యవస్థలో కార్మికులు , డ్రైవర్లు,యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలు,డిమాండ్లను పరిష్కరించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు చేపట్టాలని భారతీయ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ మజ్దూర్ మహాసంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి అల్లూరి రవిశంకర్ డిమాండ్ చేశారు. కరీంనగర్ వ్యాన్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైవర్స్ ,ఓనర్స్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటు రవాణా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, డ్రైవర్ లందరికీ ఈఎస్ఐ పీఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. వాహనాల ఇన్సూరెన్స్ 50% తగ్గించాలని, రవాణా శాఖ విభాగంలో దళారీ వ్యవస్థను అరికట్టాలని , రోడ్డు టాక్స్ కట్టే రవాణా వాహనాలకు టోల్ చార్జీల నుండి మినహాయింపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వం తీసుకోవాల్సిన వాహనాల స్క్రాప్ పాలసీ 15 సంవత్సరాలు ఉన్నందున దాన్ని 20 సంవత్సరాలవరకు పెంచాలని కోరారు. దేశవ్యాప్తంగా ఒక టాక్స్ కట్టే విధంగా ఇంటర్ స్టేట్ టాక్స్ ఉండాలని, ప్రైవేట్ వాహన లారీ, డీసీఎం డ్రైవర్లు హైవేలలో విశ్రాంతి తీసుకోవడానికి విశ్రాంతి భవనాలు ఏర్పాటు చేయాలన్నారు. ట్రాన్స్పోర్ట్ వాహనాలు నగరంలోకి ప్రవేశించే సమయాన్ని పొడిగించాలని, ట్రాన్స్పోర్ట్ వాహనాలకు ఆర్టిఏ పోలీసులు వేసిన చాలాన్లను 50% కు తగ్గించాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ డ్రైవర్స్ ఓనర్స్ ల న్యాయమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని , లేనియెడల అసోసియేషన్ ఆధ్వర్యంలో తగిన కార్యాచరణతో పోరాటం చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు. ఇట్టి సమావేశంలో భారతీయ ప్రైవేట్ ట్రాన్స్పోర్ట్ మజ్దూర్ మహా సంఘ్ జాతీయ రాష్ట్ర కార్యదర్శి యాదయ్య, బి ఎం ఎస్ జిల్లా కన్వీనర్ పుప్పాల సురేష్, కన్వీనర్ సమ్మయ్య, జిల్లా నాయకులు బండి మల్లయ్య యాదవ్, సంపత్, శ్రీశైలం, మహ్మద్ షమీర్, మోహన్ రెడ్డి, సిద్ధి సంపత్, కుమార్ యాదవ్, కర్ణాకర్, రమేష్, అంజయ్య లతోపాటు ప్రైవేట్ డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఆసక్తికరంగా మారనున్న రాజకీయాలు

**బీఆర్ఎస్-కాంగ్రెస్ పొత్తు ఫిక్స్ అయినట్లేనా?**

**హైదరాబాద్ :**

తెలంగాణలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో రానున్న రోజుల్లో తెలంగాణ రాజకీయాలు మరింత ఆసక్తికరంగా మారనున్నాయి. అధికార బీఆర్ఎస్ పార్టీ ప్రాంతీయ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదిగే క్రమంలో పార్టీని విస్తరిస్తోంది. ఇతర రాష్ట్రాల్లోనూ సభలు, సమావేశాలు పెడుతోంది. ఇతర రాష్ట్రాల్లో కూడా కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలు కూడా సమీపిస్తుండటంతో బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు వివిధ రాజకీయ పార్టీల అధినేతలతో సమావేశమౌతున్నారు. కేంద్రంలో అధికార బీజేపీకి వ్యతిరేకంగా రాజకీయ పార్టీలను ఏకతాటిపైకి తీసుకువచ్చేందుకు ఆయన తీవ్రంగా యత్నిస్తున్నారు. ఇంతకాలం కాంగ్రెసేతర, బీజేపీయేతర పార్టీల నేతలతో కలిశారు. కాంగ్రెసేతర, బీజేపీయేతర కూటమిగా ఉంటామనే సంకేతాలిచ్చారు.అదానీ అంశంపై విపక్షాలు ఏకతాటిపైకి వచ్చాయి. పార్లమెంట్ లోపల, బయట కూడా ఉమ్మడి పోరాటం చేస్తున్నాయి. దీంతో పాటు రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడటంతో బీజేపీకి వ్యతిరేకంగా విపక్షాల్లో ఐక్యత మరింత పెరిగింది. కాంగ్రెస్ కూడా విపక్షాలతో కలిసి పోరాటాలు చేస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్-కాంగ్రెస్ దోస్తీకి నెమ్మదిగా సంకేతాలు వెలువడ్డాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మహిళా బిల్లుపై ఢిల్లీలో ఆందోళన చేసిన సమయంలో యూపిఏ చైర్ పర్సన్ సోనియా గాంధీకి సెల్యూట్ చేశారు. దీంతో కాంగ్రెస్ పార్టీలో కూడా సానుకూల సంకేతాలు వెలువడ్డాయి.మరోవైపు తెలంగాణలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ అధికార బీఆర్ఎస్‌పై ఆరోపణలు, విమర్శలు చేస్తూనే ఉంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకత్వ వైఫల్యాలను ఎండగడ్తున్నారు. ఇదే తరుణంలో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీని) ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలతో కలసి పనిచేస్తామన్నారు. మోదీ పాలనపై ప్రజలు గొంతు విప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. బీజేపీని వ్యతిరేకించే పార్టీలన్నీ కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వాలన్నారు. బీజేపీపై పోరుకు, ఎన్నికలకు సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీతో కాంగ్రెస్ పొత్తు అనేది.. ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజలు నిర్ణయిస్తారని జానారెడ్డి చెప్పారు.జానారెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవని కొట్టిపారేయలేం. అలా అని ఆయన కూడా చెప్పుకోలేదు. ఈ క్రమంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యత ఏర్పడింది. ఈ ఏడాది తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పొత్తు ఉంటుందా లేదా అనేది ఇప్పటికిప్పుడే ఒక నిర్ధారణకు రాలేం. కానీ కొద్ది రోజులుగా రెండు పార్టీల నాయకత్వాల నుంచి వెలువడుతున్న సంకేతాలు పొత్తు కుదిరే దిశగా ఆశలు చిగురింపచేస్తున్నాయి. అదే జరిగితే తెలంగాణలో కొత్త రాజకీయాలు మొదలౌతాయి. బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరితే రెండు పార్టీలకు మేలు చేయడమే కాక బీజేపీకి అసెంబ్లీ ఎన్నికల్లో కూడా చెక్ పెట్టడానికి అవకాశం కుదురుతుందని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు పొత్తు కుదరకపోయినా తర్వాతైనా అవసరాన్ని బట్టి రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరేందుకు తాజా పరిణామాలు తోడ్పడనున్నాయి. అయితే సొంత బలంతో అధికారంలోకి రావాలని రెండు పార్టీలూ యత్నిస్తున్నాయి. ఈ తరుణంలో బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పొత్తు వల్ల లాభనష్టాలను అంచనా వేసుకుని రెండు పార్టీల అధినాయకత్వాలు ముందుకెళ్లే అవకాశం ఉంది. నిజానికి ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఈ రెండు పార్టీల మధ్య పొత్తు కుదిరితే 2024లో జరగబోయే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి దారులు మూసేసేందుకు రెండు పార్టీలకు అవకాశం కుదురుతుంది.మరోవైపు 2019లో బీజేపీ తెలంగాణ నుంచి 4 ఎంపీ సీట్లు సాధించి సత్తా చాటుకుంది. 2024లో మరిన్ని ఎక్కువ ఎంపీ సీట్లు సాధించాలని కమలనాథులు లక్ష్యం పెట్టుకున్నారు. ఈ క్రమంలో బీఆర్ఎస్- కాంగ్రెస్ మధ్య పొత్తు కుదిరితే బీజేపీకి కష్టకాలమే అని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. బీజేపీ కనుక మోదీ నాయకత్వం దేశానికి మరికొంత కాలం అవసరమనే విషయాన్ని తెలంగాణ ప్రజలకు నచ్చచెప్పడంలో సక్సెస్ అయితే ఎన్నికల్లో కమలనాథుల పంట పండేందుకు కూడా అవకాశం ఉంటుందని పరిశీలకుల అంచనా. బీజేపీ నాయకత్వం ఇప్పటికే బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ముందుంది.

# జాతీయ వర్షాధార ప్రాంత పథకం

**పత్తికొండ**



మండల వ్యవసాయ అధికారి వెంకటరాముడు ఆధ్వర్యంలో చిన్నహుల్తి గ్రామ రైతులకు జాతీయ వర్షాధార ప్రాంత పథకం పథకం కింద సబ్సిడీ ద్వారా చిన్నహుల్తి గ్రామ రైతులకు సబ్సిడీ ద్వారా పెబ్బేరు పశువుల మార్కెట్ నందు గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి చేతుల మీదుగా రైతులకు పశువుల సంతలో ఆవులను కొనుగోలు చేయడం జరిగినది.ఈ పథకం కింద ఆవులు,మేకలు, కోళ్ల ను 50% రాయితీ కింద రైతులకు ఇవ్వబడును. అలాగే పండ్లతోటలైన దానిమ్మ, చినీ వంటి పంటలు వేసే వారికి 50% రాయితీ కింద ఇవ్వబడును. గ్రామం నందు ఆవులు 8 యూనిట్లు, కోళ్లు 28 యూనిట్లు, మేకలు 22 యూనిట్లు, పళ్ళ తోటలు 8 యూనిట్లు ఇవ్వబడును.ఒక రైతుకు ఒక యూనిట్ కింద 2 ఆవులు, 10 మేకలు, 20 కోళ్లు, పండ్ల తోటలు 5 ఎకరాలు చొప్పున 50% రాయితీ ఇవ్వబడును అని మండల వ్యవసాయ అధికారి వారు గ్రామ రైతులకు తెలియజేయడం జరిగింది. కార్యక్రమం నందు పత్తికొండ మండల వ్యవసాయ అధికారి వెంకట్రాముడు వారు చిన్నహుల్తి గ్రామ సర్పంచ్ కేశవరెడ్డి పశుసంవర్ధక శాఖ వెటర్నరీ డాక్టర్ వినయ్ ,, వ్యవసాయ విస్తరణ అధికారి రియాజ్ బాషా వారు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ లక్ష్మి నారాయణ మరియు అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్ నాయక్ ఆర్ బి కే వాలంటీర్ వీరాంజనేయులు రైతులు పాల్గొనడం జరిగింది.

## అమరావతి పాదయాత్రలో నిలిచిపోయిన వెంకటేశ్వర స్వామి రథం

**రామచంద్రాపురం**

గత ఏడాది అమరావతి రైతులు తలపెట్టిన అరసవల్లి పాదయాత్ర గత కొన్ని రోజులుగా నిలిచిపోయిన సంగతి అందరికీ తెలిసిందే. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పాదయాత్రలో నిజమైన రైతులు లేరని ఖచ్చితమైన రైతంటూ ఉంటే తన ఆధార్ కార్డుతో పాదయాత్రలో పాల్గొనాలని నిబంధన సూచించడంతో రామచంద్రపురం మండలం చోడవరం వద్దకు రాగానే రాష్ట్ర ప్రభుత్వం ఖచ్చితమైన నిబంధనలను అమలు చేయడం జరిగింది. అందులో భాగంగా అక్కడ ఉన్న వాహనాలన్నీ తరలిపోగా, ఒక వెంకటేశ్వర స్వామి ఉన్న రథ వాహనం మాత్రమే చోడవరంలో ఉంచారు. .దీనిని ఈరోజు కొందరు రైతులు ,టిడిపి నాయకులు కొబ్బరికాయ కొట్టి అరసవల్లి పంపించారు



# రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన తారలుగా 'షష్టిపూర్తి'..

నటకిరీటి డా. రాజేంద్ర ప్రసాద్, నటి అర్చన... ఈ జోడీ పేర్లు వింటే 'లేడీస్ టైలర్' గుర్తుకు వస్తుంది. 'సుజాతా....మై మర్ జాతా' డైలాగును, ఆ సన్నివేశాన్ని, ఆ సినిమాను అంత త్వరగా ఎవరు మర్చిపోతారు? చెప్పండి! తెలుగులో ట్రెండ్ సెట్ చేసిన బ్లాక్ బస్టర్ సినిమాల్లో అదొకటి. ఆ సినిమా వచ్చిన 37 ఏళ్లకు మళ్లీ కాంబినేషన్ రిపీట్ అవుతోంది. ఓ కొత్త సినిమాలో సూపర్ హిట్ జోడీ నటిస్తోంది.

రాజేంద్ర ప్రసాద్, అర్చన ప్రధాన పాత్రల్లో ఓం ంంఎ ప్రొడక్షన్స్ సంస్థ నిర్మిస్తున్న సినిమా 'షష్టిపూర్తి'. రూపేష్ కుమార్ చౌదరి, ఆకాంక్షా సింగ్ జంటగా నటిస్తున్న ఈ సినిమాకు పవన్ ప్రభ దర్శకుడు. రూపేష్ కుమార్ చౌదరి నిర్మాత. చెన్నైలోని ఇసైజ్ఞాని ఇళయరాజా స్టూడియోస్‌లో ఈ రోజు పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఇసైజ్ఞాని సంగీత దర్శకుడు ఇళయరాజా కెమెరా స్విచాన్ చేయగా... సూపర్ గుడ్ ఫిలింస్ ఆర్‌బి చౌదరి క్లాప్ ఇచ్చారు.

సినిమా హీరో, నిర్మాత రూపేష్ కుమార్ చౌదరి మాట్లాడుతూ "రాజేంద్ర ప్రసాద్, ఇళయరాజా వంటి లెజెండ్స్‌తో సినిమా చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. 'లేడీస్ టైలర్' తర్వాత రాజేంద్ర ప్రసాద్, అర్చన గారు చేస్తున్న చిత్రమిది. 'లేడీస్ టైలర్' తర్వాత రాజేంద్ర ప్రసాద్, ఇళయరాజా కాంబినేషన్‌లో 'ఆస్తులు అంతస్థులు', 'చెట్టు కింద ప్లీడర్', 'ఏప్రిల్ 1 విడుదల' వంటి మ్యూజికల్ హిట్స్ వచ్చాయి. చాలా సంవత్సరాల తర్వాత వాళ్ళ కాంబినేషన్ కూడా రిపీట్ అవుతోంది. సినిమాలో మొత్తం నాలుగు పాటలు ఉన్నాయి. ఇదొక న్యూ ఏజ్ ఫ్యామిలీ డ్రామా. ఈ నెలలో రెగ్యులర్ షూటింగ్ స్టార్ట్ అవుతుంది. జూలైలో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం. త్వరలో మరిన్ని వివరాలు వెల్లడిస్తాం" అని చెప్పారు.









Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950